పెన్ పవర్
తెలంగాణ రౌండప్

బహుదూర్‌పల్లి వాయు పుత్ర కాలనీలో బహుళ అంతస్తుల నిర్మాణం..



వాయుపుత్ర కాలనీలో అదనపు అంతస్తును ఇలా కూల్చివేత.. గ్యాస్ కట్టర్ ఏది..



# పేదలే సమిధలా..?
# భారీ నిర్మాణాలపై చర్యలేవి..?

- సిఎంసి కమిషనర్ ఆదేశాలేంటి..? పట్టణ ప్రణాళిక చేస్తున్నది ఏంటి..?
- మై క్యూర్ సిటిజన్ యాప్‌ను కూడా నిర్వీర్యం చేస్తున్న సిఎంసి వ్యవస్థ..!
- ఎస్‌టిఎఫ్ టీమ్‌ను దాదాపుగా నిద్ర పుచ్చినట్టే..?
- వాయుపత్ర కాలనీలో టౌన్‌ప్లానింగ్ స్టైల్లో కూల్చివేత.. మళ్ళీ కట్టుకునే వెసులుబాటు..
- సందు గొందులకే పరిమితమైన చర్యలు..? ప్రధాన కూడళ్ళలో 'బేరం' కుదిరిందా..?
- రోజుకు ఒకటే..! 5 రోజుల్లో ఐదు..! ఒక్కో నిర్మాణంలో ఒకటి రెండు రంధ్రాలు..
- కూల్చివేతల్లోనూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న దుండిగల్ సర్కిల్-59 అధికారులు..



రోడ్డు ఆక్రమించి ఇలా కబ్జా.. మొత్తం దాదాపు 15.5 అడుగులు ముందుకు వచ్చిన నిర్మాణం..

- బౌరంపేట్‌లో పెదల పట్టాల్లో రెండు.. గండిమైసమ్మ 168లో ఒకటి.. మళ్లీ నిర్మిస్తే..?
- మొన్న బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 238, 239 ప్రభుత్వ భూమిలోనూ ఒకటి..!
- బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో ఈ నిర్మాణాలు సక్రమమేనా..? చర్యలేవి..?
- మీ సిబ్బందికి క్లాస్‌మేట్ ఒకరు, తెలిసిన బిల్డర్‌లు మరొకరు..? అయితే వదిలేస్తారా..?
- బతుకమ్మ ఆటస్థలం కబ్జాలోనూ కొందరివి కూల్చేసి.. మరికొందరివి వదిలేశారు..!
- ఈ వివక్ష ముడుపులకు అనుగుణంగా ఉంటాయా..? సిఫార్సులకు తగ్గట్టుగానా..?

బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో..



- సిఎంసి రికార్డుల కోసం పేదల ఇళ్ళు వెతికి మరీ అన్నట్టు, టౌన్‌ప్లానింగ్ చర్యలు..?
- ముడుపుల కోసం బడాబాబుల అక్రమ కట్టడాలకు సిఎంసి భద్రత కల్పిస్తుందా..?
- పాలకులు సరిగ్గా లేకపోతే..! పరిపాలనలో ఈ తరహా పరిణామాలే ఉంటాయేమో..?
- గ్యాస్ కట్టర్‌లతో స్లాబ్‌లు తొలగించాలని ఆదేశాలు..మరి కాంక్రీట్ తొలగిస్తే చర్యలేనా..?
- సరిగ్గా 24 గంటల్లో మళ్ళీ నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్న వైనం..?
- మొక్కుబడి చర్యలు ఎవరి మెప్పు పొందటానికి..? ఎవరి లాభాపేక్ష కోసం..?
- ప్రమాదకర అక్రమ బహుళ అంతస్తులు వదిలేసి..! ఎస్ ం 3 అంటూ చర్యలు..
- ఇవికూడా అక్రమమే కాదనడం లేదు..! అయినప్పటికీ ఇవే కీలకం కాదు కదా..!
- కార్యాలయం చుట్టూ పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు, అక్రమ సెల్లార్‌లు..?
- బహుళ అంతస్తుల వాళ్ళు మీ బంధువులా..? ముడుపుల దాతలా..?
- మున్సిపల్ నుండి సిఎంసిలో విలీనమైనా..! టౌన్‌ప్లానింగ్‌లో కనిపించని మార్పులు..?
- బదిలీలు లేకుండా ఆర్థిక లావాదేవీల ప్రక్రియలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బిజీ..?



-4లో

బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో, నిబంధనలు ఉల్లంఘించి, రోడ్డు ఆక్రమించిన నిర్మాణం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సమస్యలు చెప్పేదెవరు..?
# వినేదెవరు..?

కొంపల్లి సిఎంసి డిప్యూటీ కమిషనర్ 'మార్నింగ్ వాక్' ఉద్దేశం..?

- ప్రజలు ఉన్నప్పుడు అధికారులు రాలేదు..!అధికారులు వచ్చినప్పుడు ప్రజలు లేరు..!
- సూరారం రాజీవ్ గృహకల్పలో కొంపల్లి డిప్యూటీ కమిషనర్ పర్యటన..
- మంగళవారం 'మార్నింగ్ వాక్'లో కలుస్తానన్న డీసీ బుధవారం ప్రత్యక్షం.



-5 లో




## గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల
# క్షేత్రస్థాయి పరిశీలన..!

ఐదు చెరువులను, అధికారులతో సందర్శించి దుండిగల్ డిప్యూటీ కమిషనర్..

- నిమజ్జన ఏర్పాట్లపై డీసీ వెంకట మణి కరణ్ ప్రత్యేక దృష్టి..
- బౌరంపేట్, దుండిగల్ సహా ఐదు చెరువుల క్షేత్రస్థాయి పరిశీలన..
- నిమజ్జన రూట్లు, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు..
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పన..
- ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నివారణకు పకడ్బందీ చర్యలు..
- పోలీస్, ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో ఏర్పాట్లకు ఆదేశం..


-5 లో

# పేదలే సమిధలా..? భారీ నిర్మాణాలపై చర్యలేవి..?



నర్సాపూర్ రోడ్డులో తాజా టిఫిన్స్ పక్కన, చర్యలన్నీ ముగిసాయి.. అయినా కమర్షియల్ కాంప్లెక్స్ సిద్ధం..


టెక్ మహీంద్రా ఎదురుగా, డీసీ, ఏసిపి సమక్షంలో కూల్చేసినది.. ఇలా పూర్తయింది..



చర్యలంటేనే తెలియని, రెండు ఇంటి, అనుమతులు, ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..

**దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల తీరు.. "పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగిన" వైనాన్ని తలపిస్తుందని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. అక్రమార్జన కోసం అడ్డదారులను ఎంచుకుంటున్నారని, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. కొందరు అవినీతి అధికారుల తీరు, కేవలం ముడుపులే లక్ష్యంగా..! అక్రమ నిర్మాణాలే ధ్యేయంగా..! నిర్వర్తించే విధులు ప్రజలను రిస్తులో పెడుతున్నాయి.. మాదాపూర్ గచ్చిబౌలి అంజయ్యనగర్ ప్రమాద ఘటనతో హైడ్రా కమిషనర్, సిఎంసి కమిషనర్ ఆదేశాలతో..! సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సర్కిల్‌లలో అక్రమ కట్టడాలపై చర్యలకు ఆదేశించారు.. అయితే "కుక్కతోక" వంకర వంకరే అన్నట్టు వ్యవహరిస్తున్నారని, అధికారుల్లో కొంతైనా మార్పు వస్తుందని భావించడం పొరపాటేనని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు, సిఎంసి కమిషనర్ నివేదికల కోసమే అన్నట్టు హాస్యాస్పద చర్యలపై 'పెన్ పవర్' ప్రత్యేక కథనం..**

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 2:**

జీహెచ్‌ఎంసి నుండి- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ మరింత అధ్వాన్నంగానూ..! బరితెగింపు గానూ తయరైందనే చెప్పాలి..? అనుమతులు తీసుకున్నా, తీసుకోకపోయినా..! నిబంధనలు ఉల్లంఘించి ఏదో ఒక రకంగా ప్రమాదకర అక్రమ కట్టడాలకు ప్రాధాన్యత ఇస్తూ, 100 శాతం అక్రమ నిర్మాణాలే వెలుస్తున్నాయి.. నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు, చర్యలు ఎన్ని చేపట్టినా..! చివరికి అక్రమం నిర్మాణం-అక్రమం గానే ఉంటుంది..! టిజి-బిపాస్ చట్టానికి, నిబంధనలకు ఏమాత్రం విలువ లేకుండా చేస్తున్నది కూడా సంబంధిత అధికారులేనని, ఆరోపణలు, నిదర్శనాలు లేకపోలేదు.. పత్రికల్లో వార్తలు వచ్చినా నిర్లక్ష్యమే..? ఉన్నతాధికారులు ఆదేశించినా అలసత్వమే..? మీడియా ప్రశ్నిస్తే సమాధానం ఉండదు..! ఫోన్‌లు చేస్తే బ్లాక్ చేయడం..? జవాబుదారీ తనానికి, చెక్ పెట్టడం సర్వసాధారణమై పోయింది.. దీనంతటికి ఉన్నతాధికారుల మందలింపు లేకపోవడం ఒక కారణమైతే..? లంచాలకు అలవాటుపడి, దోచుకున్న దానిలోనే, కొంత ధనాన్ని, మందలించే పై అధికారులకూ ముట్టచెపితే అంతా సద్దుమణిగి పోతుందనే దీమా కాబోలు అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే, చోటుచేసుకోవడం దురదృష్టకరం, బాధాకరం.. మరీ హాస్యాస్పద విషయం సిఎంసి కమిషనర్ ఆదేశాల చర్యల్లో పేదలనే సమిధలుగా చేస్తున్నారనే ఆరోపణలు

**టిజి-బిపాస్ చట్టాన్ని రూపొందించిన తెలంగాణ ప్రభుత్వం, ఆ చట్టం నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు ఉండటంలేదు.. ఎస్‌టిఎఫ్ టీమ్ నియామకం కూడా జస్ట్ ఫార్మాలిటీ కోసమేనని, ఈ అక్రమ నిర్మాణాలే నిరూపిస్తున్నాయి.. "నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు" ఈ చర్యలు కేవలం ముడుపుల వరకే పరిమితం అయ్యాయి.. డిప్యూటీ కమిషనర్, ఏసిపి-టిపిఎస్ ఆధ్వర్యంలో కూల్చినవన్నీ, అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.. అందుకు అనేక ఆధారాలు (అక్రమ నిర్మాణాలు) కళ్ళెదుటే సాక్షాత్కారిస్తున్నాయి.. ప్రస్తుతం నాలుగు రోజులుగా, డీసీ, ఏసిపి సమక్షంలో కూల్చేవి కూడా, సిఎంసి కమిషనర్‌కు నివేదికల కోసమేనని, ఓ నెలరోజుల తర్వాత చూస్తే, గృహప్రవేశాలు ముగిసినా ఆశ్చర్యం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇదిలా ఉంటే రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే, అటు అసోసియేషన్ సభ్యులైనా ఫిర్యాదు చేయాలి.. టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం వెనుక ఆంతర్యం..? ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి..**


గండిమైసమ్మ చౌరస్తాలోనే, గచ్చిబౌలి తరహా ఈ పేకమేడపై చర్యలేవి..


మార్వాడీకి చెందిన రెండు పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..

## 'మై క్యూర్ సిటిజన్ యాప్'కు మర్యాదేది..?

గ్రీన్‌హిల్స్ కాలనీలో రోడ్లు ఆక్రమించి, చేపడుతున్న అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదట.. ఈ విషయంపై సిఎంసి 'మై క్యూర్ సిటిజన్ యాప్'లో స్థానికులు ఫిర్యాదు చేశారు.. అయినప్పటికీ ఏమాత్రం స్పందించలేదని ఫిర్యాదు దారులు ఆరోపించారు.. స్థానికుల ప్రకారం ఆరోడ్డు ఉన్నదే 25 ఫీట్లు, నిర్మాణ అనుమతి పొందాలంటే, కనీసం 30 ఫీట్ల రోడ్డు తప్పనిసరి..! రోడ్డుకి ఈవైపు తక్కువైన 2.5 అడుగులు, అదనంగా 5 ఫీట్ల సెట్‌బ్యాకు మొత్తం 7.5 అడుగులు, ప్లాట్ యజమాని బరించి వెనక్కు జరగాలి.. కానీ ఆ 7.5 ఫీట్లు జరగకపోగా రోడ్డుపైకి 8 ఫీట్లు జరిగి, మొత్తం దాదాపు 15.5 అడుగులు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ ఆక్రమణ వ్యవహారంలో ఎవరి స్థాయిలో వారికి, బిల్డర్ భారీగానే "తాంబూలం" సమర్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి..

## సిఎంసి చర్యలు.. సందు గొందులకే పరిమితమా..?

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు సందు గొందులకే పరిమితం చేశారా..? అందులోనూ తిరిగి ప్రశ్నించలేని "పేదలే సమిధలు"గా మారుతున్నారా..? గచ్చిబౌలి ఘటనతో అప్రమత్తం అయ్యారా..? అయినట్లు నటిస్తున్నారా..? అన్న ప్రశ్నలే కీలకంగా తలెత్తుతున్నాయి.. అసలు అక్రమ నిర్మాణాలే లేనట్టు, సందు గొందుల్లోనే ఉన్నట్టు అధికారుల చర్యల అట్టహాసం మామూలుగా లేదట.. బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 238, 239 లో ఒక అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టిన అధికారులకు, గ్రీన్‌హిల్స్ కాలనీలోని ఈ అక్రమ నిర్మాణాలు కనిపించక పోవటం హాస్యాస్పదం.. గండిమైసమ్మ సర్వే నెంబర్ 168 లో ఐదంతస్తుల అక్రమ నిర్మాణంపై తూతూ మంత్రపు చర్యలతో వెనుదిరిగిన, దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌కు, గండిమైసమ్మ చౌరస్తాలో అక్రమ నిర్మాణాలు తెలియ లేదా..? అంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు..

## జోరుగా అక్రమ నిర్మాణాల దందా..?

పోలీస్ స్టేషన్ సమీపంలోని అక్రమ సెల్లార్‌తో, రెండు అనుమతుల ఒకటే భవన నిర్మాణం వ్యవహారంలో "తిలాపాపం తలాపిడికెడు" అన్నట్టు తయారైందట.. ఓ అధికారి ఒక పర్మిషన్, జారీ చేయగానే, పత్రికల్లో వచ్చేసరికి 2వ పర్మిషన్ ఇవ్వకుండా, పై అధికారి వద్దకు వెళ్ళగానే ఆ పర్మిషన్ కూడా మంజూరు చేశారట.. ఏది ఏమైతేనేమి..? ఇద్దరు అధికారుల "అనుగ్రహం" లభించి, అక్రమ సెల్లార్‌తో కమర్షియల్ కాంప్లెక్స్ సిద్ధమవుతుందని పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు.. ఇవేమి కనిపించలేదట.. ముడుపులు ఇవ్వలేని అక్రమ కట్టడాలు గుర్తించి సందుగొందుల్లో చర్యలు చేపడుతున్నారని, స్థానికులు ఆరోపిస్తున్నారు..


గండిమైసమ్మ చౌరస్తాలో బయట రంగులు లోపల పనులు.. రంగులేస్తే రైటైపోతుందా..?


అపర్ణ టవర్స్ కింద కూల్చేసిన తర్వాతే, ఇలా షెడ్డు పూర్తి.. మతలబ్ ఏంటి..

జీరో పర్మిషన్‌తో భారీ షెడ్డు నిర్మాణం.. నో యాక్షన్..







# సమస్యలు చెప్పేదెవరు..? వినేదెవరు..?

- ప్రజలు ఉన్నప్పుడు అధికారులు రాలేదు..!అధికారులు వచ్చినప్పుడు ప్రజలు లేరు..!
- సూరారం రాజీవ్ గృహకల్పలో కొంపల్లి డిప్యూటీ కమిషనర్ పర్యటన..
- మంగళవారం 'మార్నింగ్ వాక్'లో కలుస్తానన్న డీసీ బుధవారం ప్రత్యక్షం.

- కొంపల్లి సిఎంసి డీసీ రాజీవ్ గృహకల్ప పర్యటనపై ప్రజల అసంతృప్తి..
- సమస్యలు చెప్పుకునే అవకాశం కోసం వచ్చిన స్థానికులకు నిరాశే మిగిలింది..!
- మరుసటి రోజు డిప్యూటీ కమిషనర్ వచ్చినా ప్రజలు పనులకు వెళ్లారు..
- ప్రజలు లేకుండా సమస్యలు ఎలా తెలుస్తాయి..?
- ప్రజలతో మాట్లాడకుండా అధికారులు పరిష్కరించే సమస్యలు ఏమిటని ప్రశ్నలు..?
- పర్యటనలకే పరిమితమా.. సమస్యల పరిష్కారాలు ఉంటాయా..?
- అధికారులు స్పష్టత ఇవ్వాలని రాజీవ్ గృహకల్ప వాసుల డిమాండ్..

## కొంపల్లి సిఎంసి డిప్యూటీ కమిషనర్ 'మార్నింగ్ వాక్' ఉద్దేశం..?

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు "మార్నింగ్ వాక్"ల పేరుతో అధికారులు క్షేత్రస్థాయి పర్యటన తప్పనిసరి అంటూ, సిఎంసి కమిషనర్ ఆదేశాలు తెలిసిందే.. కొంపల్లి సిఎంసి డిప్యూటీ కమిషనర్ మంగళవారం కాలనీకి వస్తానని, ఫోన్‌లు కూడా ఎత్తకుండా గైర్హాజరు అయ్యారని, ప్రజలు ఆరోపించిన విషయం విదితమే.. చివరికి స్థానికులు లేనప్పుడు బుధవారం సమాచారం లేకుండానే సూరారం రాజీవ్ గృహకల్పలో పర్యటించడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారికి వివరించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పర్యటన రద్దు కావడం.. మరుసటి రోజు ప్రజలు అందుబాటులో లేని సమయంలో అధికారి పర్యటించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. కొంపల్లి సర్కిల్ సిఎంసి పరిధిలోని సూరారం రాజీవ్ గృహకల్పలో మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య పర్యటించనున్నట్లు ముందుగానే స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు.. దీంతో కాలనీలో నెలకొన్న పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, మౌలిక వసతులు తదితర సమస్యలను నేరుగా అధికారికి వివరించేందుకు పలువురు స్థానికులు తమ రోజువారీ పనులను పక్కనపెట్టి ఎదురుచూశారు.. అధికారి వస్తారని భావించిన ప్రజలు తమ సమస్యలను చెప్పేందుకు సిద్ధమయ్యారు. అయితే పర్యటన సమయం సమీపించిన తర్వాత డిప్యూటీ కమిషనర్ రావడం లేదనే సమాచారం స్థానికులకు చేరడంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. అధికారిని కలిసి సమస్యలు వివరించే అవకాశం కోసం ఎదురుచూసిన తమకు చివరకు నిరాశే మిగిలిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు..

### మంగళవారం వస్తానన్న డిప్యూటీ కమిషనర్, బుధవారం ప్రత్యక్షం..

మంగళవారం డిప్యూటీ కమిషనర్ గైర్హాజరు, కావడంతో స్థానికుల అసంతృప్తి చెందారు.. దీంతో పలు పత్రికల్లో వార్తా కథనాలు వెలువడిన వెంటనే, బుధవారం డిప్యూటీ కమిషనర్ లావణ్య రాజీవ్ గృహకల్పలో పర్యటించడం గమనార్హం.. ప్రజలు తమ తమ పనులకు వెళ్లిపోయిన తర్వాత అధికారి పర్యటించడం పట్ల స్థానికులు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి..ప్రజలతో నేరుగా మాట్లాడకుండా, సమస్యలను వినకుండా కేవలం కాలనీలో పర్యటించడం వల్ల వాస్తవ పరిస్థితి అధికారులకు ఎలా తెలుస్తుందని వారు నిలదీస్తున్నారు..

### డీసీ పర్యటన ఉద్దేశం..?

మార్నింగ్ వాక్ పేరుతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం వెనుక ప్రధాన ఉద్దేశం ప్రజలకు అందుబాటులో ఉండటం, సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే. అయితే ప్రజలు తమ సమస్యలను వివరించే అవకాశం లేకుండా అధికారుల సందర్శన ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఈ పర్యటనతో ప్రజలకు ఎంతవరకు ప్రయోజనాన్ని ఇస్తుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. కాలనీలో పర్యటించిన అధికారులు అక్కడి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించినా.. స్థానికులతో మాట్లాడకపోతే సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం తక్కువగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు..



---

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన..!

## ఐదు చెరువులను, అధికారులతో సందర్శించి దుండిగల్ డిప్యూటీ కమిషనర్..

- నిమజ్జన ఏర్పాట్లపై డీసీ వెంకట మణి కరణ్ ప్రత్యేక దృష్టి..
- బౌరంపేట్, దుండిగల్ సహా ఐదు చెరువుల క్షేత్రస్థాయి పరిశీలన..
- నిమజ్జన రూట్లు, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు..
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పన..
- ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నివారణకు పకడ్బందీ చర్యలు..
- పోలీస్, ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో ఏర్పాట్లకు ఆదేశం..






**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** గణేష్ ఉత్సవాలలో భాగంగా, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను చేయాలని దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ అన్నారు.. బుధవారం వివిధ నిమజ్జన ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.. ఈ సందర్భంగా బౌరంపేట్ పెద్ద చెరువు, దుండిగల్ పెద్ద చెరువు, గాగిలాపూర్ కోతినార్ చెరువు, శంబిపూర్ షాకిన్ చెరువు, డి.పోచంపల్లి కుడికుంట చెరువులను ఆయన స్వయంగా పరిశీలించారు.. నిమజ్జన ఊరేగింపులు సాగే మార్గాలు, చెరువుల వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ కమిషనర్ సూచించారు.. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, దుండిగల్ పోలీస్ స్టేషన్ నుండి ఇన్‌స్పెక్టర్ బాల్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 1000 రోజుల రేవంత్ పాలన ఎలా ఉంది? సీఎం ఏమన్నారు.. జనం ఏం అంటున్నారు?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నారు. 2023 నవంబరులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయపథాన నడిపిన రేవంత్ రెడ్డి ఆ ఏడాది డిసెంబరు 7న తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. సెప్టెంబరు 2తో వెయ్యి రోజుల పాలన పూర్తికావడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున సంబరాలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలన ఒక రికార్డుగా అభివర్ణిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన నుంచి విపక్షంలోనే పోరాడిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలిసారే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ప్రభుత్వాన్ని విజయవంతంగా నడుపుతున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. సీఎంగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సమయంలో పాలనా అనుభవం లేకపోవడం, కలహాల కుంపటి వంటి కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై నడపడం సాధ్యమా? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే తన సామర్థ్యంతో రేవంత్ రెడ్డి ఎటువంటి ఆటుపోట్లు లేకుండానే ప్రభుత్వాన్ని వెయ్యి రోజులు నడపడం అంటే సామాన్య విషయం కాదని అంటున్నారు.ఇక వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున సంబరాలు చేస్తోంది. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు గుప్పిస్తూ పోరుబాటు పట్టాయి. ఈ నేపథ్యంలో తన పాలన విజయాలను క్లుప్తంగా విరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్ ఆసక్తి రేపుతోంది. "జన ఆకాంక్షలే కేంద్రంగా.. త్యాగాల ఆశయాలే ఇంధనంగా" వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నట్లు సీఎం ట్వీట్ చేశారు. పేదల అవసరాల తీర్చేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర దీర్ఘకాలిక భవిష్యత్తు, యువతకు ఉపాధిని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, నెలవారీ రూ. 2,500 నగదు ఇస్తామని ప్రకటించారు. సీఎం అయిన రెండు రోజులకే ఉచిత బస్సు పథకం అందుబాటులో తెచ్చారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నారని అంటున్నారు. కానీ, మహిళలకు రూ. 2,500 నగదు మాత్రం ఇప్పటికీ అమలు చేయలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఇక రైతులకు రుణమాఫీ చేసినా, ప్రభుత్వంపై ఆ వర్గంలో కొంత అసంతృప్తి ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చలేకపోయారని అంటున్నారు. కానీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల భర్తీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇక ఆర్థిక పరిస్థితులతో కొన్ని పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం ఇబ్బంది పడుతున్న విషయాన్ని పరిశీలకులు ఎత్తిచూపుతున్నారు.

**రాజకీయంగా పైచేయి**

కాంగ్రెస్ రాజకీయాలకు పూర్తిగా కొత్త అయినప్పటికీ ముఖ్యమంత్రిగా ఆ పార్టీ నాయకులను నడపడంలో రేవంత్ రెడ్డి విజయవంతం అయినట్లేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. భిన్నభిప్రాయాలు, అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండే కాంగ్రెస్ లో ప్రస్తుతం రేవంత్ రెడ్డి మాటను కాదనే నాయకులు కనిపించకపోవడం ఆయనకు కలిసివస్తుందని అంటున్నారు. సీనియర్లతో సైతం సఖ్యతగా ఉంటూ రాజకీయ చాణక్యాన్ని రేవంత్ రెడ్డి ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. అయితే మంత్రి పదవి ఆశించి దక్కిన ఒకరిద్దరు నేతలు, కేబినెట్ లో ఉంటూ తరచూ వివాదాస్పద వైఖరితో రచ్చకెక్కుతున్న మంత్రి కొండా సురేఖ వంటి వారి వల్ల సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు ఎదుర్కొంటున్నారు. అటువంటి వారిని అదుపు చేయడంలో ఆయన నిస్సహాయత స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు. ఏదిఏమైనా వెయ్యి రోజుల పాలనలో రేవంత్ రెడ్డి ఆశించిన దానికంటే ఎక్కువగానే మార్కులు సంపాదించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కవిత ఆ వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారా



**హైదరాబాద్, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** తెలంగాణా రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వైఖరి ఆమె రాజకీయ ధోరణి ప్రత్యర్థులను ఎంచుకునే విధానం అదే సమయంలో ఆమె చేస్తున్న విమర్శలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఆమె తనసొంత కష్టాలను జనంలో పెడుతూ కన్నీరు పెడుతున్నారు. ఆమె తనను బీఆర్ఎస్ ఎందుకు సస్పెండ్ చేసింది అని ప్రశ్నిస్తున్నారు. తండ్రి కేసీఆర్ కి తనకు మధ్య చిచ్చు పెట్టారంటూ కొందరు నేతల మీదవిమర్శలు చేస్తున్నారు. ప్రత్యేకించి రెడ్లను ఆమె టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఎందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు అన్నదే ఇపుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. సోషల్ మీడియాకోసమా : ఇదిలా ఉంటే కల్వకుంట్ల కవిత సోషల్ మీడియాలో ప్రచారం కోసం మాట్లాడుతున్నారు అన్న చర్చ సాగుతోంది. ఆమె ఏమి మాట్లాడాలనుకుంటున్నారు, ఏమి మాట్లాడుతున్నారు అన్నది అర్థంకావడం లేదని అంటున్నారు. ఆమె మాటలు ఆమె చేస్తున్న వ్యాఖ్యల మీద బయట ఇదే డిస్కషన్ అవుతోంది. కవిత ఎంపీగా చేశారు, ఎమ్మెల్సీగా చేశారు, కానీ ఆమె చేస్తున్న విమర్శలు కానీ రాజకీయ వ్యాఖ్యానాలు కానీ పరిణితి లేకుండానే చేస్తున్నారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆమె ఏ రోజు ఎవరిని టార్గెట్ చేస్తారో కూడా అర్థం కావడం లేదని అంటున్నారు. ఒక రోజు ఆమె హరీష్ రావు మీద ఘాటు అయిన విమర్శలు చేస్తారు. ఆ మరుసటి రోజు హరీష్ రావుని క్షమిస్తాను అంటారు, ఆ వెంటనే మరో నేత మీద మండిపడతారు, ఇలా ఆమె చేస్తున్న విమర్శలకు విలువ ఉంటుందా అన్న చర్చ సాగుతోంది.ఇక కవిత హరీష్ రావుని తిడుతూ ఒక రోజు స్టేట్మెంట్ ఇస్తారు, ఆ మరుసటి రోజే సంతోష్ రావుని ఘాటుగా విమర్శిస్తారు. వీళ్లే నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించారు అని ఆమె అంటారు, ఇదంతాసోషల్ మీడియాలో మైలేజ్ కోసం ఆమె ఇలా మాట్లాడుతున్నారు అని అంటున్నారు. అయినా సరే ఆమె అనుకున్న మైలేజ్ రావడం లేదని కూడా వినిపిస్తోంది. తాజాగా ఆమె నిజామాబాద్ మీటింగులోమాట్లాడుతూ తాను హరీష్ రావుని సంతోష్ రావుని క్షమిస్తానేమో కానీ ప్రశాంత్ రెడ్డిని అసలు క్షమించను అంటూ హాట్ కామెంట్స్ చేశారు. దీంతో ఆమె బాధ ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదనిఅంటున్నారు. కవిత మాట్లాడుతున్నది చూస్తే ఫక్తు ఫ్యామిలీ పంచాయతీగానే ఉంది. ఆమె బీఆర్ఎస్ నుంచి ఆ మధ్యన సస్పెండ్ అయ్యారు. ఈ రోజుకీ ఆమె అదే మాట మాట్లాడుతున్నారు. ఇదంతాజనంలో సానుభూతి కోసమే అని అంటున్నారు. అయితే అది రాకపోవడంతో ఆమె ఎవరెవరినో ముందు పెట్టి విమర్శలు చేస్తున్నారు. నిజానికి బీఆర్ఎస్ కేసీఆర్ ది. దాని వ్యవహారాలు మొత్తం చూస్తోందికేటీఆర్. మరి ఒకరు తండ్రి అయితే మరొకరు అన్నయ్య, ఇలా సాగే ఫ్యామిలీ పంచాయతీలో ప్రశాంత్ రెడ్డికి కానీ మరొకరికి కానీ ఏమి సంబంధం ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ కి ఎవరైనా కవిత గురించిచాడీలు చెబితే వింటారా, ఆయన ఎంతటి సీనియర్ నాయకుడో అందరికీ తెలుసు కదా అంటున్నారు. పైగా కుమార్తె గురించి తండ్రికి చెప్పే పరిస్థితి ఉంటుందా అని అంటున్నారు. తనను పార్టీ నుంచిబయటకు పంపాలన్నా ఉంచాలన్నా కేసీఆర్ కి కేటీఆర్ కే సర్వాధికారాలు ఉంటాయని ఆమెకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. కానీ వారిని వదిలేసి వేరే వాళ్లను అంటే లాభమేంటి అన్న ప్రశ్నలువస్తున్నాయి. రెడ్లను దూరం చేసుకుంటే : తెలంగాణా రాజకీయాల్లో రెడ్లు బలమైన శక్తిగా ఉన్నారు. నిజానికి బీఆర్ ఎస్ రెండు సార్లు అధికారంలోకి రావడానికి రెడ్లు కూడా ప్రధాన కారణం అని చెబుతారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి పార్టీ పరంగానే ఓటు బ్యాంక్ ఉంది కానీ సొంతంగా సామాజిక వర్గం ఓట్లు ఎంత అన్న చర్చ వస్తోంది. అలాంటిది రెడ్ల మీద విరుచుకుపడితే కవిత కొత్త పార్టీకి కూడా లాభమేంటిఅని అంటున్నారు. అయినా సరే కవిత ప్రతీ జిల్లా తిరుగుతూ అక్కడ రెడ్డి నాయకుల మీద నోరు పారేసుకుంటున్నారు అని అంటున్నారు. ఆమె ఈ మధ్యనే నల్గొండ జిల్లాకు వెళ్లి జగదీశ్వర రెడ్డిని అంటేఆయన లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేశారు అని అంటున్నారు. ఆ తర్వాత ఆమె నుంచి నో కామెంట్ అన్నట్లుగా ఫుల్ సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. ఇక మహబూబ్ నగర్ జిల్లాకు వెళ్ళి మరో రెడ్డిఆయనను అంటే ఆయన కూడా ఘాటుగానే కౌంటర్ ఇచ్చేశారు. రాజకీయం చేయడం అంటే : ఇపుడు నిజామాబాద్ వెళ్ళి ప్రశాంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. నిజానికి కవిత తన పార్టీబీసీల కోసం అని చెప్పుకుని తిరుగుతున్నారు కానీ బీసీలతో ఆమెకు సంబంధం ఏంటని బీసీ సంఘాలే ప్రశ్నిస్తున్నారు. రాజకీయం చేయడం అంటే ఇది కాదు కదా అని కూడా అంటున్నారు. తమ పార్టీవిధానాలు చెప్పుకోవాలి, నిర్మాణాత్మక విమర్శలు చేయాలి, అధికార పార్టీ తప్పులు ఉంటే ఎత్తి చూపాలి కానీ తమ కుటుంబ పంచాయతీలు జనంలో ఎత్తుకుని కన్నీరు పెట్టినా లేక ఒక సామాజిక వర్గాన్నిటార్గెట్ చేసినా నష్టం తప్ప లాభం ఏమి ఉంటుందని అంటున్నారు. మొత్తానికి కవిత రాజకీయం అంతా సోషల్ మీడియాలో హైప్ కోసం అన్నట్లుగానే ఉందని కామెంట్స్ వస్తున్నాయి.

# తెలుగు ఎంపీలు మరీ ఇంత దారుణమా...

**హైదరాబాద్ పెన్ పవర్:**

లోక్ సభ రాజ్యసభ ఎంపీలకు తమ నియోజకవర్గాలలో ఖర్చు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. అలా వచ్చిన నిధులను సకాలంలో ఖర్చు చేయకపోతే మురిగి పోతాయి. లోక్ సభ సభ్యులకు సొంత నియోజకవర్గంగా పార్లమెంట్ పరిధి ఉంటుంది. ఇక రాజ్యసభ సభులు అయితే నోడల్ జిల్లాను ఎంచుకుని అక్కడ నిధులను ఖర్చు పెట్టవచ్చు. వారు అవసరం అనుకుంటే ఎక్కడైనా నిధులు కేటాయించవచ్చు. మరి ఇంతలా కేంద్రం నుంచి నిధులు వస్తున్నప్పటికీ ఖర్చు విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు వెనకబడి ఉన్నారని నివేదికలు తెలియచేస్తున్నాయి. ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాల ఎంపీలు ముందు వరసలో ఉన్నారని వారు తమకు కేటాయించిన నిధులను బాగానే ఖర్చు చేశారు అని నివేదికలు చెబుతున్నాయి.ఇదిలా ఉంటే కేంద్ర గణాంక కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం చూస్తే తెలుగు రాష్ట్రాలలో ఎంపీలు తక్కువగా ఎంపీ ల్యాడ్స్ ని ఖర్చు చేశారు అని తెలుస్తోంది. అందులో కూడా తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధులను అత్యంత తక్కువగా ఖర్చు చేశారని ఈ నివేదిక చెబుతోంది. దేశవ్యాప్తంగా చూస్తే ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగం సగటున 75 శాతం ఉండగా తెలంగాణ ఎంపీల సగటు కేవలం 23 శాతం మాత్రమే ఖర్చు చేసినట్లుగా నమోదైంది. రెండు సంవత్సరాల కాలంలో తమకు కేటాయించిన నిధులలో కేవలం పది శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన ముఖ్య తెలుగు ఎంపీల జాబితా కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ సభ్యుల ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వినియోగ శాతం జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉంది అని అంటున్నారు. దీని మీద పౌర సమాజ ప్రాజెక్ట్ అయిన ఎంపవర్డ్ ఇండియన్ విడుదల చేసిన 2026 నాటి తాజా గణాంకాల ప్రకారం చూస్తే , ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం 37 మంది ఎంపీలు అంటే లోక్ సభలో లోక్‌సభ రాజ్యసభ కలిపి కేటాయించిన నిధులు వాటి వినియోగ వివరాలు చూస్తే ఖర్చు తక్కువగానే చేసినట్లుగా ఉంది. మొత్తం 554.5 కోట్లు నిధులలో వినియోగ శాతం కేవలం 22.86 శాతంగా ఉంది.ఇదిలా ఉంటే ఎంపీ ల్యాడ్స్ నిధులు ఖర్చు చేసినా పోర్టల్ అప్‌డేట్ లోపాలు ఉన్నాయని ఎంపీల ఆఫీసుల నుంచి వస్తున్న మాటగా ఉంది. పనుల్లో జాప్యానికి ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయని ఒటున్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు పూర్తి కాకపోవడానికి బిల్లులు విడుదల కాకపోవడానికి గల కారణాలు ఉన్నయాని చెబుతున్నారు. అలాగే ఆమోదాల విషయంలో జాప్యం కూడా జరుగుతోందని అంటున్నారు. ఎంపీలు అభివృద్ధి పనుల కోసం సిఫార్సు లేఖలు ఇచ్చినప్పటికీ జిల్లా యంత్రాంగం వాటికి త్వరితగతిన పరిపాలనా అనుమతులు ఇవ్వకపోవడంతో పాటు నిర్వహణ సంస్థల నిర్లక్ష్యం కూడా ఉందని అంటున్నారు: మున్సిపల్ కార్పొరేషన్లు పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా వంటి ప్రభుత్వ అమలు సంస్థలు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం కూడా ఎంపీ ల్యాడ్స్ ఖర్చు విషయంలో కొంత వెంకబటుతనానికి కారణం అని చెబుతున్నారు. ఇక పోర్టల్ అప్‌డేట్స్ లో లోపాలూన్నయాని అంటున్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని పనులు జరుగుతున్నప్పటికీ వాటి వివరాలను జిల్లా ప్రణాళిక అధికారులు కేంద్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల కూడా నివేదికలలో ఎంపీలు తక్కువ ఖర్చు చూపిస్తోంది అని అంటున్నారు. ఏది ఏమైనా తెలుగు ఎంపీలు తమకు కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ ని వేగంగా ఖర్చు చేస్తే వాటి ఫలితాలు అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువ అవౌతాయని అంటున్నారు.

# ఎలివేటెడ్ కారిడార్లకు బ్రేక్..

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** హైదరాబాద్ నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యఅడ్డంకిగా మారింది. సర్కార్ నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలంటే ఇప్పటికే నిర్మాణ పనులు వేగం పుంజుకోవాల్సి ఉండగా.. డిఫెన్స్, ప్రైవేటు భూములు పూర్తిస్థాయిలో హెచ్ఎండీఏకుఅందకపోవడంతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్-44లోని డెయిరీఫాం వైపు 5.40 కిలోమీటర్ల మేర ఒక ఎలివేటెడ్ కారిడార్,ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వైపు 18.5 కిలోమీటర్ల మేర మరో కారిడార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడినితగ్గించడం, ప్రయాణ సమయాన్ని కుదించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. అయితే రెండు కారిడార్లకూ రక్షణశాఖతో పాటు ప్రైవేటు భూములు అవసరం కావడంతో భూసేకరణ, అప్పగింత ప్రక్రియ కీలకంగామారింది.ప్యారడైజ్--ఎన్‌హెచ్-44 డెయిరీఫాం కారిడార్ మొత్తం 5.40 కిలోమీటర్లలో 3.20 కిలోమీటర్ల మేర రక్షణశాఖ భూములపై నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో సుమారు రెండు కిలోమీటర్ల మేర భూమిని రక్షణశాఖ హెచ్ఎండీఏకు అప్పగించింది. దీంతో ఆ ప్రాంతంలో పనులు క్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. ఇంకా సుమారు ఒక కిలోమీటర్ పరిధిలో రక్షణ భూముల అప్పగింత పూర్తి కావాల్సి ఉంది. ఈ కారిడార్‌లో మరో 1.6 కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు భూములు అవసరం ఉంది. భూముల సమీకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ అవార్డు పాస్ చేయాల్సిన ప్రక్రియ మిగిలి ఉంది.మరోవైపు రక్షణశాఖ భూముల్లో రక్షణ గోడల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో కారిడార్ పనులు దశలవారీగా ముందుకు సాగుతున్నాయి.ప్యారడైజ్ శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ విషయంలో మాత్రంపరిస్థితి వేరుగా ఉంది. మొత్తం 18.5 కిలోమీటర్ల ప్రాజెక్టులో 9.813 కిలోమీటర్ల మేర రక్షణశాఖ భూములు అవసరం. ఇందులో సుమారు 7.5 కిలోమీటర్ల భూమికి క్లియరెన్స్ లభించింది. మిగిలినభూముల విషయంలో ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కారిడార్‌లో ప్రైవేటు భూముల సేకరణ కూడా నెమ్మదిగా సాగుతోంది. మొత్తం 8.327 కిలోమీటర్ల పరిధిలో వివిధ ప్రాంతాల్లో ప్రైవేటు భూములుఅవసరం ఉండగా.. ఇప్పటివరకు సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పూర్తయింది. దీంతో ఈ మార్గంలో నిర్మాణ పనులు ఇంకా ప్రాథమిక దశను దాటలేదు. భూములు పూర్తిస్థాయిలోఅందకపోవడమే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు.రెండు ఎలివేటెడ్ కారిడార్లకు కలిపి మొత్తం 165.587 ఎకరాల రక్షణశాఖ భూములు అవసరమవుతున్నాయి. ఇందులో ఇప్పటివరకు91.790 ఎకరాలు హెచ్ఎండీఏకు అప్పగించారు. ఇంకా 73.797 ఎకరాల భూమి అప్పగించాల్సి ఉంది. కీలకమైన భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వేగంపై ప్రభావం పడుతోంది

# డిసెంబర్ లో కార్పొరేషన్ ఎన్నికలు



**హైదరాబాద్ పెన్ పవర్:**

తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు ఇతర వాయిదా పడిన పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జీహెచ్ఎంసీని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్‌గా పునర్వ్యవస్థీకరించడం, 'సర్' ప్రక్రియ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది. అక్టోబర్ 19 తర్వాత షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు, పరిపాలన సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకోనున్నారు.తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబరు నెలలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు ఎన్నికలు వాయిదా పడిన ఇతర పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో పురపాలక శాఖ అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 116 మున్సిపాలిటీలు,

7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. అయితే అప్పటికి జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీకాలం పూర్తికాకపోవడంతో వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. కొన్ని ప్రత్యేక కారణాలతో మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు.జీహెచ్ఎంసీ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగిసిన అనంతరం ప్రభుత్వం దానిని మూడు కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలను కలుపుతూ మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ పునర్వ్యవస్థీకరణ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైనట్లు తెలుస్తోంది.ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతుండటంతో అధికారులు దానిపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. అక్టోబర్ 19 నాటికి ఆ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉండటంతో, ఆ తర్వాత కొంత సమయం తీసుకుని డిసెంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. వాతావరణ పరిస్థితులు, పరిపాలనా సన్నద్ధత, ప్రజలకు ఇబ్బందులు తగ్గించే అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


## మాదన్నపేట్ మార్కెట్ లో భారీ అగ్నిప్రమాదం

# మార్కెట్ లో వరుస ఘటనలు

**లక్షల్లో కిరాయిలు వసూళ్లు.. కానీ జాగ్రత్తలు శూన్యం...**

**హైదరాబాద్ పెన్ పవర్:** మాదన్నపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదన్నపేట్ మార్కెట్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మంటలు అర్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది. గతంలో కూడా రెండుసార్లు అగ్నిప్రమాదం చోటుచేసుకున్న మార్కెట్ యాజమాన్యం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో స్థానికులు, వ్యాపారస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యజమ్యం కేవలం లక్షల్లో కిరాయిలు వసూళ్లు చేసుకుంటున్నారని ...కానీ జాగ్రత్తలు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రాణ నష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు

## పొలంబడితో నాణ్యమైన ఆహారోత్పత్తులు




పొలంబడితో రైతులకు అవగాహన

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్2:** పొలంబడి కార్యక్రమంతో రైతులు పురు గుమందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహారోత్పత్తులు సాధించవచ్చని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బసవన్నప్ప అన్నారు. గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ప్రొడక్షన్ ఆఫీసర్ ఉదయ శంకర్ ఆధ్వర్యంలో బుధవారం రైతు పొలంబడి కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్లాంట్ ప్రొడక్షన్ ఆఫీసర్ బసవన్నప్ప హాజరై మాట్లాడారు మిరపలో పొలంబడి ఉద్దేశాన్ని 14 వారాల పాటు నిర్వహించే తరగతుల గురించి వివరించారు
పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు మంచి వ్యవసాయ సాగు పద్ధతులపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందని, విత్తనం ఎంపిక నుంచి విక్రయం వరకూ శాస్త్రీయ పంట సాగు పద్దతులపై అవగాహన కల్పించడం జరుగుతుందని రైతులందరూ ప్రతి వారం పొలంబడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్య కైలా గార్ల బయ్యారం మండలాల వ్యవసాయ అధికారులు రామారావు రాజు ఉద్యానవన శాఖ అధికారి శాంతి ప్రియ వ్యవసాయ విస్తరణ అధికారి మేఘన గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ముఖ్యమంత్రి 'కోమటిరెడ్డి'



**హైదరాబాద్ పెన్ పవర్:** 'కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని పార్టీలో ఉన్న అసలైన నేతలను పక్కన పెడుతున్నారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కొందరు నేతలు పార్టీని కబ్జా చేస్తున్నారు. మా ఇంట్లో నుండి మమ్మల్నే వెల్లగొంటాలని చూస్తున్నారా ? నేను మాత్రం చూస్తూ ఊరుకోను' అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆయన స్వగ్రామం బ్రాహ్మణవెల్లంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.శాసనసభ ఎన్నికలకు ముందు పార్టీలో చేరే సమయంలో, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నాకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. కానీ నెరవేరలేదు అని రాజగోపాల్ రెడ్డి అన్నాడు. మంత్రి పదవి కోసం గత కొన్నాళ్ళుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.అదే సమయంలో 'నాకు పదవుల మీద ఆశలేదని, సమయం వచ్చినప్పుడు అవే వెతుక్కుంటూ వస్తాయని, తాను భవిష్యత్తులో ఖచ్చితంగా ముఖ్యమంత్రి స్థానాన్ని అధిగమిస్తానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. పదవుల కంటే రాజకీయాల్లో, ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పు రావడం ముఖ్యమని, పేద ప్రజల సమస్యలు పక్కనపెట్టి, సొంత ప్రయోజనాల కోసం పనిచేసే సంస్కృతి మారాలని, అభివృద్ధి పనులు నిలిచిపోయిన విషయంలో తాను గళం విప్పుతూనే ఉంటానని రాజగోపాల్ రెడ్డి అన్నాడు.రాజగోపాల్ రెడ్డి ఒక వైపు పదవులు అడగను అంటూనే అధిష్టానం ఇవ్వడం లేదని లేదా సమయం వచ్చినప్పుడు అవే వస్తాయని, మంత్రి కాదు ఏకంగా ముఖ్యమంత్రి అవుతానని అంటున్నాడు. కొండా సురేఖ అంశం ఢిల్లీలో అధిష్టానం ముందు పరిశీలనలో ఉన్న నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.ఆయన గతంలోనూ బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం పెరిగిందని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వారు కీలక పదవుల్లో ఉన్నారని, నిజమైన ఉద్యమకారులు అణచి వేయబడుతుందని, మునుగోడు అభివృద్ధికి నిధులు ఇవ్వకుంటే బాంబు పేలుస్తానని, యాదాద్రి ఆలయ బోర్డు ఏర్పాటుపై తనను సంప్రదించలేదని అన్నారు.రెండు రోజుల క్రితం ఎక్స్ స్పేస్ లో తెలంగాణలో కొత్త రాజకీయ శక్తి వస్తుందని, అందులో తన పాత్ర కీలకంగా ఉంటుందని, తమిళనాడు మాదిరిగా తెలంగాణ రాజకీయాలు మారాలని, అవినీతి గ్రామీణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి వ్యాపించిందని, రాజకీయ నాయకుల ఆలోచన విధానం మారాలని అనడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం ఎలా స్పందిస్తుంది ? కోమటిరెడ్డి మంత్రి పదవి కల నెరవేరుతుందా ? అన్నది వేచిచూడాలి.

## ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ వల్ల కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నడు



**హైదరాబాద్ పెన్ పవర్:** వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని.. కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో 17 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని.. సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదల కడుపు నింపుతున్నామని ఆయన గుర్తుచేశారు. 2026, సెప్టెంబర్ 2వ తేదీన ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని.. అతని ఫ్యామిలీలో ఉన్న ప్రాబ్లమ్స్ వల్ల ఫ్రస్టేషన్?తో ఉన్నాడని మంత్రి వివేక్ వెంకటస్వామి చురకలు అంటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్?లో లక్ష కోట్ల అవినీతి జరిగిందని.. కూలిపోయే ప్రాజెక్ట్?ను కట్టారని దుయ్యబట్టారు. ఈ విషయంపై మాట్లాడటానికి.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన అన్యాయంపై కేటీఆర్ ఎందుకు నోరెత్తటం లేదని మంత్రి ప్రశ్నించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హస్తినలో పేలిన 'కొండా' బాంబు !



**హైదరాబాద్ పెన్ పవర్:** 'నా మీద చర్యలు తీసుకోవాలి అనుకుంటే ముందుగా సీఎం రేవంత్ రెడ్డి మీద చర్యలు తీసుకోవాలి. పదేళ్లపాటు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటి వరకూ నన్ను రాజీనామా చేయాలని ఎవరూ అడగలేదు. అధిష్టానం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాను. బీసీలకు ఒక న్యాయం, ఇతర వర్గాలకు ఒక న్యాయం ఉంటుందా ?' అని మంత్రి కొండా సురేఖ ఢిల్లీలో మీడియా చిట్ ఛాట్ లో వ్యాఖ్యానించారు. దీంతో కొండా మాటల వెనక అంతర్యం ఏమిటి అన్న చర్చ మొదలైంది.కొండా సురేఖ కూతురు సుష్మిత రేవంత్ రెడ్డి మీద చేసిన ఆరోపణల నేపథ్యంలో క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటీసులు ఇవ్వడం, కొండా సురేఖ దానికి బదులు ఇవ్వడం, కొండా సురేఖను పదవి నుండి తప్పించాలని క్రమశిక్షణ సంఘం పార్టీ అధిష్ఠానానికి సిఫారసు చేయడంతో వ్యవహారం ఢిల్లీకి చేరింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ను కలిసేందుకు కొండా అనుమతి కోరగా వెంటనే ఢిల్లీకి రావాలని చెప్పడంతో నిన్న సురేఖ ఢిల్లీకి వెళ్లింది. నిన్న రేవంత్ రెడ్డితో గంట పాటు భేటీ అయిన కేసీ వేణుగోపాల్ సురేఖతో మాట్లాడలేదు. ఈ రోజు ఆయనతో కొండా సురేఖ భేటీ అవుతారని అందరూ భావించారు.
అయితే కేసీ వేణుగోపాల్ తో భేటీకి ముందే కొండా సురేఖ రేవంత్ రెడ్డి మీద చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు, బీసీలకు ఒక న్యాయం, ఇతరులకు ఒక న్యాయం ఉంటుందా ? అని చేసిన వ్యాఖ్యలతో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరోక్షంగా మంత్రి పదవికి రాజీనామా చేయాలని సంకేతాలు వచ్చిన నేపథ్యంలోనే ఆమె చిట్ చాట్ లో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అంటున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు కొండా సురేఖ దంపతులు తమ కూతురు చేసిన వ్యాఖ్యలతో తమకేం సంబంధం అని చెబుతూ వస్తున్నారు. కొండా సురేఖ క్రమశిక్షణ సంఘానికి ఇచ్చిన సంజాయిషీలోనూ తన కూతురు వ్యాఖ్యలపై తనను సమాధానం చెప్పాలని అడగడం భావ్యం కాదన్నారు. అదే సమయంలో కొండా మురళి మాట్లాడుతూ ' నా కూతురుకు 38 ఏళ్లు. ఆమెకు 12 ఏళ్ల బిడ్డ. ఆమె ఏం మాట్లాడుతుంది అన్నది మేము చెప్పాల్సిన అవసరం లేదు' అని అన్నారు.
ఇప్పటి వరకు బిడ్డ చేసిన వ్యాఖ్యలకు తన మీద చర్యలు ఎలా తీసుకుంటారు అంటూ వస్తున్న కొండా సురేఖ అధిష్టానంతో భేటీకి ముందే నేరుగా రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేయడం అంటే పదవి నుంచి తప్పుకోవాలన్న సంకేతాలు అందడమే అన్న వాదన వినిపిస్తున్నది. ఈ పరిణామాల బట్టి అసలు అధిష్టానం కొండా సురేఖను కలుస్తుందా ? పదవికి రాజీనామా చేయాలని అదేశిస్తుందా ? ఒకవేళ రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తే కొండా సురేఖ ఎలాంటి వైఖరి అవలంబిస్తుంది ? అన్న చర్చ మొదలైంది.,

## సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ సభలో బైటాయించి నీటి కోసం ఆందోళన



గ్రామపంచాయతీ ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న మహిళలు



బిందెలు ఎత్తుకొని నిరసన తెలియజేస్తున్న సిపిఎం పార్టీ నాయకులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఫిల్టర్ బెడ్ కు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజలకు నీటి ని సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు.గత వారం రోజులు గా గార్ల పట్టణ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, నీటి సమస్య ను తీర్చాలని పట్టణ ప్రజలు, మహిళలు ఖాళీ బిందెలతో నెహ్రు సెంటర్ నుండి పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభ వరకు ప్రదర్శన చేసి గ్రామ సభ వద్ద మహిళ లు, సిపిఎం నాయకులు బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతవారం పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు నీటితో ఇబ్బందులు పడుతున్నారని, అయినా పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వెలబుచ్చారు. భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రత్యమ్నయ మార్గాల ద్వారా నీటిని అందించి నీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ బానోత్ పార్వతి హతిరం నాయక్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపు లైన్ మరమ్మత్తుల కారణంగా నీటి సరపరా లో ఇబ్బందులు ఏర్పడ్డాయని,ప్రత్యామ్నయ మార్గాల ద్వారా పట్టణ ప్రజలు కు నీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ ఆందోళన కు న్యూడేమోక్రసి మండల కార్యదర్శి జి. సక్రు,ఐద్వా మండల కార్యదర్శి ఎం నాగమణి,వార్డు సభ్యులు పూర్ణ చందర్,టీ జె ఎస్ రాష్ట్ర నాయకులు జి. మురళి తారక్, సిపిఎం,ఎన్ డి నాయకులు టీ. నాగేశ్వరావు, మాన్య లు మద్దతు పలికి ఆందోళన లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్పన, దుర్గ, స్వరూప, సుగుణ, మంగమ్మ, రమాదేవి, వెంకటలక్ష్మి, నవ్య, బేగం, సునీత, సుజాత, అనిత, ప్రజలు పాల్గొన్నారు.

# మహానేతకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు గార్ల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో గల వైయస్ఆర్ విగ్రహానికి సింగిల్ విండో చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతీ హతిరామ్ నాయక్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీంబర్స్మెంట్ ఇలా ఎన్నో పథకాలతో, బడి ఈడు పిల్లల నుండి పండు ముసలి వరకు సంక్షేమ సారధిగా పేదల ఎదుగుదలకు బాటలు వేసిన మహనీయుడు దివంగత నేత వై.యస్ రాజశేఖర్ రెడ్డి అని భౌతికంగా మనకు దూరం ఉన్నా, పథకాల ద్వారా లబ్ది పొందిన ప్రతి ఒక్కరి చిరునవ్వులో ఎప్పటికి కలకాలం నిలిచి ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భుక్యా నాగేశ్వరరావు మర్రిగూడెం సర్పంచ్ భూక్యరాంసింగ్ ఉప సర్పంచ్ మహమ్మద్ జరీనా కాంగ్రెస్ పార్టీ నాయకులు రహీం ఖాన్ షేక్ యాకుబ్ పాషా బాబూలాల్ కోల కుమార్ గౌడ్ దీకొండ రాము నెహ్రూ ఉస్మాన్ మంద రవి గౌడ్ షేక్ మౌలానా గుండ్లపల్లి నాగయ్య సైజాద్ ముత్యం పూర్ణ తదితరులు ఉన్నారు.

# శ్రీవారి భక్తులను మోసగిస్తున్న 249 వెబ్ సైట్లు

**తిరుమల సెప్టెంబర్ 2, పెన్ పవర్:**
కిలీ వెబ్‌సైట్ల గురించి తిరుమల శ్రీవారి భక్తులను టీటీడీ మరోసారి అప్రమత్తం చేసింది. గదుల కేటాయింపు పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ.. పోస్టర్లు, తప్పుడు హామీలతో భక్తులను మోసం చేస్తున్న 249 నకిలీ వెబ్‌సైట్‌లను ఈ సంవత్సరం ఇప్పటివరకు గుర్తించినట్లు టీటీడీ తెలిపింది. ఆ ఫేక్ వెబ్‌సైట్లను తొలగించామని.. రెండు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపింది. ఆన్‌లైన్‌లో టీటీడీ పేరుతో కనిపించే నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులను హెచ్చరించింది. శ్రీవారి దర్శనం, వసతి, సేవలు, టోకెన్ల విషయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని.. తిరుమలకు సంబంధించిన అన్ని సేవలు, నిబంధనలు, మార్గదర్శకాలపై అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.దర్శనం, గదుల కేటాయింపు అంటూ మోసాలకు పాల్పడుతున్న దళారులపై ఈ ఏడాది ఇప్పటివరకు 30 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 43 మంది టీటీడీ ఉద్యోగులపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. తిరుమలకు వచ్చే భక్తులు తమ సూచనలు, నిబంధనలు పాటిస్తూ.. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించింది.ఇక తిరుమలకు వచ్చే వెంకన్న భక్తులు తమ వెంట తీసుకువచ్చే వస్తువులపైనా టీటీడీ కీలక సూచనలు చేసింది. తిరుమలకు వచ్చే వాహనాల్లో నిషేధిత వస్తువులను తరలించకుండా అలిపిరి, శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టీటీడీ తెలిపింది. నిషేధిత వస్తువులను గుర్తిస్తే.. అలిపిరి టోల్‌గేట్ స్కానింగ్ కేంద్రం వద్దనే సీజ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు అలిపిరి వద్ద 261 డ్రోన్లు, 105 మెటా స్మార్ట్ గ్లాసెస్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. తిరుమల క్షేత్రంలో భద్రత, గోప్యతను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి భక్తులు.. డ్రోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి రికార్డింగ్ పరికరాలను తమ వెంట తీసుకురావద్దని విజ్ఞప్తి చేసింది.తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోందన్న టీటీడీ.. పరిమితికి మించి వస్తున్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించింది. వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత సమయానికే భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా అన్ని విభాగాలు సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం పేర్కొంది.

**భారీగా పెరిగిన లడ్డూల విక్రయం**

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. గత ఆరు నెలలుగా కొండపై భక్తుల రద్దీ పెరిగింది.. ముఖ్యంగా వీకెండ్, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువా కనిపిస్తోంది. టీటీడీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తుండటంతో స్వామివారి హుండీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. గత రెండు, మూడు నెలలుగా వెంకన్నకు కాసుల వర్షం కురిసింది. తాజాగా ఆగస్టు నెలలోనూ స్వామివారికి భారీగా ఆదాయం వచ్చింది.తిరుమల శ్రీవారిని ఆగస్టు నెలలో 24,56,017 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు వేంకటేశ్వరస్వామివారికి రూ.137.44 కోట్లు కానుకల రూపంలో సమర్పించారు. అలాగే1.30 కోట్ల లడ్డూలను విక్రయించారు. 10.50 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆగస్టు నెలలో ఏకంగా మూడుసార్లు హుండీ ఆదాయం రూ.5 కోట్లు దాటింది. ఆగస్టు 18న అత్యధికంగా 6.12 కోట్ల ఆదాయం సమకూరింది. ఆగస్టు 16న అత్యధికంగా 97,014 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. ఆగస్టు 15న అత్యధికంగా 53,090 మంది తలనీలాలు సమర్పించారు. ఆగస్టు 19 నుంచి 28 మధ్య రద్దీ తీవ్రంగా ఎక్కువగా ఉంది.. ఆ సమయంలో దర్శనానికి గరిష్ఠంగా 24 గంటల వరకు సమయం పట్టింది.మరోవైపు రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్.అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు,

పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు ఋత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది ఋత్వికులు గోగర్భం తీర్థంలో నడుము లోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. అదేవిధంగా ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది ఋత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.టీటీడీ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో సెప్టెంబరు 4న గోకులాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మదిన వేడుకలకు గోసంరక్షణశాల ఆధ్యాత్మిక వేదికగా నిలవనుంది. భక్తిభావాన్ని పెంపొందించేలా గోపూజతో పాటు వేదపఠనం, భజనలు, కోలాటాలు, సంకీర్తనలు, హరికథ తదితర కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనుంది. గోకులాష్టమి రోజున ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారికి అభిషేకం, 6 గంటలకు వేణుగానం, 7.30 గంటలకు వేదపఠనం నిర్వహిస్తారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులచే భజనలు, కోలాటాలు, ఉదయం 8 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే శ్రీహరి సంకీర్తనలు ఆలపిస్తారు. ఉదయం 10 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులకు స్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని దివ్య లీలలు, గోసేవ మహాత్యాన్ని వివరించే హరికథ నిర్వహించనున్నారు.

# ఎన్టీఆర్ , జగన్ జీవితాలలో ఒకేసారి విషాదం నింపిన రోజు.. ఏంటో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** సెప్టెంబర్ 2 అనగానే తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక తీరని విషాద జ్ఞాపకమే గుర్తొస్తుంది. రాజకీయ వర్గాల్లోనూ, సినీ వినోద ప్రపంచంలోనూ తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న ఇద్దరు ప్రముఖుల జీవితాల్లో తండ్రి లేని లోటును తీవ్రంగా గుర్తుచేసే రోజు ఇది. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరి జీవితాల్లోనూ తమ మార్గదర్శకులైన తండ్రుల జ్ఞాపకాలు ఈ ఒక్క రోజే ముడిపడి ఉండటం ఒక విచిత్రమైన, భావోద్వేగమైన కాంబినేషన్.

**వైఎస్ జగన్ జీవితంలో ముగియని ఆరాటం –**

**సెప్టెంబర్ 2:**
2009 సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కన్నుమూశారు. ఇక తండ్రి వైఎస్సార్ వర్ధంతి కావడం వైఎస్ జగన్ జీవితంలో పూడ్చలేని లోటును మిగిల్చింది. ప్రతి సంవత్సరం ఈ రోజున జగన్ ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తూ, తండ్రి ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తానని భావోద్వేగంగా స్మరించుకుంటారు. జగన్ రాజకీయ ప్రస్థానానికి వైఎస్సార్ చూపిన బాటనే పునాది.

**జూనియర్ ఎన్టీఆర్ – తండ్రి జ్ఞాపకాలతో జయంతి సందడి:**

మరోవైపు నందమూరి హరికృష్ణ జయంతి కూడా సెప్టెంబర్ 2నే కావడం విశేషం. 1956 సెప్టెంబర్ 2న జన్మించిన హరికృష్ణ, 2018 ఆగస్టు 29న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇక తండ్రి మరణించినప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజున ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్‌లు తీవ్రమైన బాధతో తండ్రిని స్మరించుకుంటారు. "ఈ అస్తిత్వం మీరు.. ఈ వ్యక్తిత్వం మీరు" అంటూ ఎన్టీఆర్ షేర్ చేసే పోస్టులు నందమూరి అభిమానులను కంటతడి పెట్టిస్తుంటాయి.

**ఇద్దరి జీవితాల్లోనూ తండ్రుల పాత్ర అత్యంత కీలకం:**

జగన్ మరియు ఎన్టీఆర్ ఇద్దరి ఎదుగుదలలోనూ వారి తండ్రుల పాత్ర ఎంతో ఉంది. జగన్‌కు ప్రజాసేవ, ధైర్యం అనే లక్షణాలు వైఎస్సార్ నుంచి వస్తే, ఎన్టీఆర్‌కు మొక్కవోని ధైర్యం, క్రమశిక్షణ, నటనలో గంభీరత తండ్రి హరికృష్ణ నుంచే అబ్బాయి. ఇక సొంత కాళ్లపై నిలబడి ఇద్దరూ తమ రంగాల్లో అగ్రస్థానానికి చేరుకున్నప్పటికీ, తండ్రుల అడుగుజాడలే తమకు నిరంతర ప్రేరణ అని ఇద్దరూ బలంగా నమ్ముతారు.

**ఒకే రోజు చుట్టుముట్టే రెండు వేర్వేరు భావోద్వేగాలు:**

ఒకే తేదీ ఇద్దరు ప్రముఖుల కుటుంబాల్లో విభిన్నమైన, లోతైన జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది. ఒకరికి తండ్రి వర్ధంతి కాగా, మరొకరికి తండ్రి జయంతి. రోజులు మారినా, సంవత్సరాలు గడిచినా సెప్టెంబర్ 2 రాగానే జగన్ మరియు ఎన్టీఆర్ ఇద్దరి మనసుల్లోనూ తమ తండ్రుల జ్ఞాపకాలు సుడులు తిరుగుతాయి. ఇక అభిమానులు కూడా సామాజిక మాధ్యమాల వేదికగా వైఎస్సార్, హరికృష్ణలకు ఘనంగా నివాళులు అర్పిస్తారు.తండ్రులు శారీరకంగా దూరమైనప్పటికీ, వారు నేర్పిన విలువల రూపంలో జగన్, ఎన్టీఆర్ జీవితాల్లో నిరంతరం జీవించే ఉంటారు. సెప్టెంబర్ 2 అనేది కేవలం ఒక తేదీ మాత్రమే కాదు, ఆ ఇద్దరి నమ్మకానికి, ధైర్యానికి పునాది వేసిన తండ్రులను నిష్టతో స్మరించుకునే ఒక భావోద్వేగ మైలురాయి.

# వైసీపీ లోగుట్టు...దిద్దుకోకపోతే భారీ షాక్

**విజయవాడ, సెప్టెంబర్ 2, పెన్ పవర్:**
వైసీపీ పైకి పటిష్టంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. కానీ సంస్థాగతంగా ఎన్నో లోపాలు సమస్యలు ఉన్నాయని అంటున్నారు. రాజకీయాల్లో జనాదరణ ఉండడం ఒక్కటే కొలమానం కాదు, ప్రజాకర్షణ అంటే జనాలను ఎక్కువగా తమ సభలకు రప్పించుకోవచ్చు.జేజేలు పలికించుకోవచ్చు. అయితే అవన్నీ ఓట్లు కావు. ఓట్లుగా మారాలంటే ఆ కథ వేరేగా ఉంటుంది. పొలిటికల్ గ్లామర్ వేరు పొలిటికల్ గ్రామర్ వేరు. గ్లామర్ లేకుండా గ్రామర్ ఉన్నా రాజకీయంగా రాణించవచ్చు. కానీ గ్లామర్ ఉండి గ్రామర్ లేకపోతే మాత్రం మనుగడ కష్టంగా మారుతుంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన పార్టీలు కూడా ఉన్నాయి. ఎంతో మంది సెలబ్రిటీలకు తరగని జనాదరణ ఉంటుంది. కానీ వారు రాజకీయంగా పార్టీలు పెట్టి ఎందుకు ఫెయిల్యూర్ అవుతున్నారు అంటే పొలిటికల్ గ్రామర్ లేకపోవడమే అన్నది నిష్టుర సత్యం. ఇటీవల కాలంలో కొన్ని సర్వేలు వస్తున్నాయి. వైసీపీ గ్రాఫ్ పెరుగుతోంది అని అంటూ. అందులో అతిశయోక్తులు పక్కన పెడితే నిజాలు కూడా ఉన్నాయి. ఎలా అంటే అధికారంలో ఉన్న పార్టీకి యాంటీ ఇంకెంబెన్సీ అన్నది సహజం. మరి అది ప్రతిపక్షానికే టర్న్ అవుతుంది. అలా వైసీపీకి కూడా జరిగి ఉండొచ్చు. కానీ అలా గ్రావిటీ మాదిరిగా వస్తున్న ఈ యాంటీ ఇంకెంబెన్సీని ఒడిసి పట్టుకుని తమకు అనుకూలంగా చేసుకునే సామర్థ్యం సత్తా వైసీపీకి ఏ మేరకు ఉన్నాయన్నదే అసలైన ప్రశ్నగా ముందుకు వస్తోంది. వైసీపీ పెట్టి పదిహేనేళ్ళు అయింది కదా ఆ పార్టీ బలంగా ఉంది కదా అంటే అవన్నీ కరెక్టే కానీ ఈ రోజున ఎలా గ్రౌండ్ లెవెల్ లో ఉంది అన్నదే ముఖ్యమని అంటున్నారు. కానీ ఆయన పేరుతో వచ్చే ప్రతీ ఓటుని జాగ్రత్తగా ఈవీఎంలలో వేయించుకునే



స్తోమత కలిగిన పార్టీ యంత్రాంగం జిల్లాలలో నియోజకవర్గాల స్థాయిలో ఉందా అన్నదే పెద్ద చర్చ. వైసీపీ 2024లో ఓటమి పాలు అయ్యాక చాలా మంది పార్టీని వీడిపోయారు. దాని కంటే ముందు చూస్తే అనేక మంది సైలెంట్ అయ్యారు. ఇక వైసీపీ చేసిన రాజకీయ బదిలీలు షిఫ్టింగులు అన్నీ కూడా ఆ పార్టీకి అధిక శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో బలమైన ఇంచార్జిల లోటుని స్పష్టంగా చూపిస్తున్నాయని అంటున్నారు. ఒక ప్రముఖ సెఫాజలిస్టు తాజాగా వైసీపీ గ్రౌండ్ లెవెల్ పరిస్థితి గురించి మాట్లాడుతూ వైసీపీకి జనంలో ఆదరణ పెరిగినా అది ఓట్లుగా మార్చుకునేలా పార్టీ యంత్రాంగం ఉండాలని అన్నారు. నూటికి డెబ్బై శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసీపీకి వీక్ అయిన ఇంచార్జిలే ఉన్నారని అన్నారు. వీరంతా వైసీపీకి ఓటు బ్యాంక్ ని పెంచే వారు కారని కూడా చెప్పుకొచ్చారు.వ్ వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ బలమైన అభ్యర్ధులతో బరిలోకి దిగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎందుకంటే కూటమి బలంగా ముందుకు వస్తుందని దానిని ఢీ కొట్టాలంటే వైసీపీ ఇంచార్జిలు అన్ని విధాలుగా ఆరి తేరిన వారు అయి ఉండాలని అభిప్రాయపడ్డారు.. వైసీపీకి చెందిన 175 అసెంబ్లీ ఇంచార్జిలతో ఇటీవల అధినాయకత్వం కీలక సమావేశాన్ని నిర్వహించింది. అలాగే వారి పని తీరుని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని చెబుతోంది. మరి అన్నీ చేస్తున్న వైసీపీ పెద్దలకు ఈ వీక్ పాయింట్ ఏంటో స్పష్టంగా తెలియదా అన్నది ఒక చర్చ. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ వ్యవధి ఉంది కాబట్టి వైసీపీ సంస్థాగతంగా బలంగా ఉండేలా ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలకు దిగాలని హితైషులు సూచిస్తున్నారు. లేకపోతే భారీ షాక్ తగిలినా తగలవచ్చు అని అంటున్నారు.

# రోజుకు 18 గంటల డ్యూటీతో చంద్రన్న

**తిరుపతి సెప్టెంబర్ 2, పెన్ పవర్:**
దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల పనితీరుపై ఢిల్లీ ఐఐఎం నిపుణులు అధ్యయనం చేశారు. దీనికి సంబంధించిన రిపోర్టును కొన్ని రోజుల్లోనే బహిర్గతం చేయనున్నట్టు జాతీయ మీడియా వెల్లడించింది. దీనిలో ప్రధానంగా ఏపీ సీఎం చంద్రబాబు పనితీరుకు నిపుణులు ఎక్కువ మార్కులు వేయడం గమనార్హం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీహార్, ఏపీ, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలన సాగుతోంది.ఏ దేశానికైనా గొప్ప విజయం ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రుల పనితీరు విషయంపై అధ్యయనం చేసిన ఢిల్లీఐఐఎం.. ప్రజా సేవకు, పాలనకు వారు కేటాయిస్తున్న సమయం.. వారంలో ఎన్నిరోజులు పనిచేస్తున్నారు.. అనే విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. దీనిలో ఏపీ సీఎం చంద్రబాబు రోజులకు 12 గంటల పాటు పనిచేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. వాస్తవానికి చంద్రబాబు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని.. ఆయనే స్వయంగా చెబుతున్నారు. అయితే.. ఐఐఎం ఢిల్లీ మాత్రం 12 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నారని పేర్కొంది. ఇక, వారంలో ఆరు రోజుల పాటు సీఎం చంద్రబాబు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని.. పేర్కొంది. అలానే.. పాలన విషయంలో 24 గంటలూ స్పందిస్తున్నారని తెలిపింది. ఇక, మంత్రి వర్గంతో అత్యంత సఖ్యతగా ఉంటున్న సీఎంగా కూడా.. చంద్రబాబుకు తొలిస్థానం ఇచ్చింది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు ఆయన నివేదికలు తెప్పించుకుని సరిచేసుకుంటున్నారని పేర్కొంది. అవినీతి రహిత పాలన అందించేందుకు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి బాగుందని కితాబివ్వడం గమనార్హం. కానీ, సీఎం సువేందు అధికారి కేవలం 6 గంటలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపింది. బీహార్ ముఖ్యమంత్రి కూడా 6 గంటలకే పరిమితం అవుతున్నారని.. వారానికి 5 రోజులు మాత్రమే పనిచేస్తున్నారని చెబుతోంది. కాగా.. ఈ రిపోర్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలోనే వెల్లడించనున్నారు. ప్రజాభిప్రాయాలు.. పాలన తీరు, తీసుకుంటున్న నిర్ణయాల ఆధారంగా ఈ నివేదికను రెడీ చేస్తున్నారని సమాచారం.

# ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు

**నెల్లూరు, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలుపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి. బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు.సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు–ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బొప్పరాజు ప్రకటించిన ఉద్యమంతో తమకు సంబంధం లేదని మిగతా సంఘాల నేతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏపీ జేఏసీ కూడా సొంతంగా పనిచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయని అంటున్నారు.

# ఏకగ్రీవానికి నో అగ్రీ...

**విజయవాడ, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** ఏకగ్రీవం వద్దు అని మరోసారి స్పష్టం చేశారు వైసీపీ చీఫ్ వైఎస్ జగన్. అది కూడా తన సొంత జిల్లా సొంత ప్రాంతం పులివెందుల వేదికగా ఆయన బిగ్గర స్వరం వినిపించారు. ఏకగ్రీవాలు అన్న మాటే వద్దు అని వైసీపీ లీడర్ ని క్యాడర్ ని ఆదేశించారు. ప్రతీ చోటా వైసీపీ పోటీ చేసి తీరాల్సిందే అని కూడా జగన్ గట్టిగానే దిశా నిర్దేశం చేశారు. దాంతో ఏపీలో ఏకగ్రీవాల విషయంలో బిగ్ వార్ కూటమి వర్సెస్ వైసీపీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకే రోజున అటు ప్రభుత్వ అధినేత చంద్రబాబు ఏకగ్రీవాలు అన్నవి అవసరమని ఆహ్వానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సభలో బాబు ఏకగ్రీవాల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దానికి ధీటుగా పులివెందుల నుంచి జగన్ పోటీ ఉండాల్సిందే అంటున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ నేతలు అంతా ఒక చాలెంజ్ గా తీసుకోవాలని జగన్ కోరారు. ఆయన పులివెందులలో పార్టీ నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు ఎక్కడా ఏకగ్రీవం అన్నదే వద్దు, దానికి అసలు చాన్స్ ఇవ్వవద్దు అని చెప్పారు. ప్రతీ చోటా ప్రతీ సీటుకూ వైసీపీ పోటీ పడి తీరాల్సిందే అని కూడా జగన్ అన్నారు. ఇక అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చినా లేదా పోలీసులను ప్రయోగించినా దౌర్జన్యాలకు పాల్పడినా కూడా వైసీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ కోరారు. భయపడకండి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని జగన్ భరోసా ఇచ్చారు. అంతే కాదు వైసీపీ హయాంలో జరిగిన మేలుని, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఏకగ్రీవాలు మేలు అని గ్రామ స్థాయిలో కక్షలు కార్పణ్యాలకు తావు లేకుండా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని కూడా ఆయన వివరంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవాలు అన్నవి గతంలో జరిగినవే అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుకు తెస్తున్నారు. ఇక అధికారంలో ఏ పార్టీ ఉంటే వీలుగా ఏకగ్రీవాలు చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. అలాంటిది అసలు ఏకగ్రీవం అన్న మాటే వినిపించకూడదని జగన్ ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. అంటే పోటీకి వైసీపీ సై అంటోంది. అలాంటి పరిస్థితి ఉంటే కనుక అది గ్రామ స్థాయిలో కానీ పల్లెలలో కానీ ఒక రాజకీయ సమరానికే దారి తీస్తుందని అంటున్నారు. ఢీ అంటే ఢీ అంటూ రాజకీయం సాగి ప్రశాంత వాతావరణం వేడెక్కిపోతుంది అని అంటున్నారు.నిజంగా పోటీకి మరో పక్షం సిద్ధంగా ఉంటే అది ప్రజాస్వామిక విధానంగా చూడాలి. అలా కాకుండా పోటీని అనివార్యం చేయడం తగదన్న మాట వినిపిస్తోంది. అలాగే పోటీకి సిద్ధంగా ఎవరైనా ఉంటే ఏకగ్రీవం పేరుతో వారి గొంతు నొక్కే తీరు మంచిది కాదని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ అంతటా ఒకేలా రాజకీయం ఉండదు, స్థానికంగా ఉండే పరిస్థితుల బట్టి అది మారుతూ ఉంటుంది. అందువల్ల ఏకగ్రీవాలు వద్దు అని వైసీపీ బిగ్ సౌండ్ చేసినా అలాగే కావాలని కూటమి కోరినా అది స్థానిక పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఎక్కడికక్కడ లోకల్ గా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన ఎన్నికలను ప్రతిష్టగా మార్చాలనుకుంటే భీకర పోరుకు నాంది పలికినట్లు అవుతుందని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# కమలం కాలు దువ్వినట్లేనా ?!



బీహార్ లో పేపర్ లీకేజీలు, నియామకాల్లో అవకతవకలపై నిరసన తెలిపిన విద్యార్థుల మీద లాఠీఛార్జ్, టియర్ గ్యాసులు ప్రయోగించడం, అరెస్టులు చేయడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించి ఇది విద్యార్థుల భవిష్యత్తుపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆరోపించింది. అదే సమయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ 'బీహార్ లో ఏకె 47 ఆటంకవాది మీద కాదు విద్యార్థి మీద ప్రయోగించారు. విద్యార్థులను హింసించారు. జైలుకు పంపించారు. దీనికి హోంమంత్రి అమిత్ షా జవాబుదారీగా ఉండాలి. లేకుంటే ప్రజలు వారిని ఒకరోజు బయటకు లాగి జవాబు అడుగుతారు' అని హెచ్చరించారు. అదే సమయంలో ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఖర్గే ర్యాలీ చేసిన వేదికపై ఆయన వెళ్లిన తర్వాత దానిని శుద్ధి చేశారు. దీనిని దళిత వ్యతిరేక చర్యగా కాంగ్రెస్ అభివర్ణించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు వెళ్లిన యువజన కాంగ్రెస్ నిరసన తెలిపి, కార్యాలయం మీద నల్లరంగు చల్లింది. దీంతో రెండు పార్టీల మధ్య వివాదం మొదలయింది.బీజేపీ కార్యాలయం మీద యువజన కాంగ్రెస్ పార్టీ దాడికి నిరసనగా నల్లగొండ జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలు క్యాంపు కార్యాలయం మీద టమాటాలు, కోడిగుడ్లు విసిరి, మంత్రి ఫ్లెక్సీని తగులబెట్టారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ జిల్లా కార్యాలయం, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటి మీద దాడి చేసి ఫర్నీచర్, టీవీ, ఫ్రిజ్ లను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ లు జరిపి అరెస్టులు చేశారు.ఆ తరువాత ఈ గొడవ యాదాద్రి భువనగిరికి మళ్లింది. అక్కడ బీజేవైఎం కార్యకర్తలు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ క్యాంపు కార్యాలయం మీద దాడిచేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసి, ఎమ్మెల్యే ఫ్లెక్సీల మీద ఆయిల్, నల్లరంగు చల్లారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయం మీద దాడికి దిగడంతో రెండు చోట్లా పోలీసులు లాఠీచార్జ్ జరిపారు.నల్లగొండలో పార్టీ అధ్యక్షుడి ఇంటి మీద దాడి నేపథ్యంలో పరామర్శించేందుకు బయలుదేరిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇది ప్రజాస్వామ్యం మీద దాడి అని అన్నారు. మరోవైపు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దీనిపై స్పందిస్తూ 'దాడులు చేసే వారిని కాపాడుతూ, పరామర్శకు వెల్తున్న వారిని అరెస్ట్ చేయడమేనా ఇందిరమ్మ రాజ్యం' అని ప్రశ్నించారు.మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీనిపై స్పందిస్తూ కాంగ్రెస్ గూండాయిజం మీద విచారణ జరపాలని, సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి నిందితుల మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డీజీపీకి మెమోరాండం అందించారు. వరసగా రెండు రోజుల దాడుల నేపథ్యంలో జాతీయ బీజేపీ అధ్యక్షుడు నితన్ నబీన్ స్పందించారు.పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఫోన్ చేసి విషయాలు తెలుసుకున్నారు. 'కాంగ్రెస్ గూండాలు దాడి చేస్తే అధికార యంత్రాంగం మౌనం వహిస్తుంది. బీజేపీ నేతలు బాధితులను కలవాలంటే అరెస్టు చేస్తారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం గురించి చెప్పడం హస్యాస్పదం. తెలంగాణ రాహుల్ గాంధీ నియంత మనస్తత్వానికి జవాబు చెబుతుంది' అని ఎక్స్ ఖాతాలో స్పందించారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద బీజేపీ మెతక వైఖరి అవలంభిస్తుందని జరుగుతున్న చర్చ నేపథ్యంలో తాజా దాడులు, ప్రతి దాడులు చర్చానీయాంశంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ విషయంలో ఇక కమలం పార్టీ జూలు విదిల్చి కాలు దువ్వినట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే నిరసనలు హింసాత్మకం కాకూడదని, ప్రజాస్వామ్యబద్దంగా నిరసనలు జరిగితేనే ప్రజల నుండి ఆదరణ ఉంటుందని అంటున్నారు. మరి ఈ దాడులు ఎక్కడి వరకు వెళతాయి ? ఎక్కడ ముగుస్తాయి ? అనే దానికి కాలమే సమాధానం చెబుతుంది.

# ఆశ ఎక్కువైతే ఆస్తులు కూడా ఆపదగా మారతాయ్.. ఎన్నారైలకు ఇప్పుడు అర్థమవుతోంది..



అప్పట్లో అమెరికా అంటే మంచి జాబ్.. డాలర్ల వర్షం.. వీకెండ్ సరదాలు.. సొంత ఊరి బంధువుల ముందు బిల్డప్‌లు. కానీ కరోనా పుణ్యమా అని 'వర్క్ ఫ్రమ్ హోమ్' వెసులుబాటు రావడంతో మన హెచ్1బీ వీసా మహానుభావులకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఐటీ కంపెనీలు కళ్లు మూసుకుని ఇచ్చే భారీ ప్యాకేజీలు, పైగా దొంగచాటుగా రెండు చోట్ల చేసే ఉద్యోగాలు ఒకేసారి మూన్‌లైటింగ్ చేసే కుషన్ దొరకడంతో ఊహలు ఆకాశాన్ని తాకాయి. బ్యాంకుల్లో ఊరికే పడి ఉన్న డాలర్లను చూసి.. "అకౌంట్‌లో ఉంటే ఏం బాగుంటుంది? పోనీ ఓ రెండూ మూడు ఇళు కొనేద్దాం" అని ఫిక్స్ అయిపోయారు.

అనుకున్నదే తడవుగా తక్కువ వడ్డీ రేట్ల ఆశ చూపి బ్యాంకులు పిలిచి మరీ అప్పులిస్తుంటే.. సొంతింటితో పాటు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మరో రెండు ప్రాపర్టీలను ఖాతాలో వేసుకున్నారు. "ఓ ఇంటికి అద్దె వస్తుంది. దాంతోనే మార్ట్‌గేజ్ కట్టేయొచ్చు. ఎలాగో డ్యూయల్ ఇన్‌కమ్ ఉంది కదా" అని వేసుకున్న లెక్కలు చూసి వేళ్లపై లెక్కలేసుకుని మురిసిపోయారు.కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా.. మహమ్మారి తగ్గింది, టెక్ కంపెనీలకు జ్ఞానోదయం అయింది. లేఆఫ్‌లు, పింక్ స్లిప్పుల పర్వం మొదలైంది. ఒకప్పుడు రెడ్ కార్పెట్ వేసి పిలిచిన కంపెనీలే ఇప్పుడు క్యాబిన్ సర్దేసి వెళ్లమంటున్నాయి. ఈ ట్విస్ట్‌తో ఇప్పుడు పరిస్థితి ఎలా తయారైందంటే.. "ముందర చూస్తే ఉద్యోగం ఊడే ముప్పు.. వెనక్కి చూస్తే నెలకు వేల డాలర్ల ఈఎంఐల దెబ్బ" లా మారింది.అప్పట్లో "ప్రాపర్టీ అంటే అసెట్" అని ఎగిరి గంతేసి కొన్న ఇళ్లు ఇప్పుడు 'అడకత్తెరలో పోకచెక్కలా' మారాయి. పోనీ ప్రాపర్టీని అమ్మేద్దామా అంటే మార్కెట్లో కొనే నాథుడు లేడు. ఆశించిన ధర అసలే రాదు. అద్దెకు ఇద్దామంటే టెనెంట్లు దొరకరు. సరే ఇంట్లో ఉన్న సగం భారం తగ్గిస్తుందని ఆశపడ్డ హెచ్-4 ఈఏడీ వీసా ఇల్లాళ్ల ఉద్యోగాలపైనా ఇమ్మిగ్రేషన్ నిబంధనల కత్తులు నిరంతరం వేలాడుతూనే ఉన్నాయి. ఒక వైపు కార్ లోన్లు.. మరోవైపు పిల్లల స్కూల్ ఫీజులు.. వీటిని మించిన భారీ మార్ట్‌గేజ్ చెల్లింపులు.. ఉద్యోగం పోతే ఇవన్నీ ఎలా కట్టాలో తెలియక గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.ఒకప్పుడు సోషల్ మీడియాలో "మరో ప్రాపర్టీ కొన్నాం గైస్" అని ఫోటోలు పెట్టి బిల్డప్ ఇచ్చిన మన ఎన్నారైలు.. ఇప్పుడు ప్రతి నెలా వచ్చే మార్ట్‌గేజ్ స్టేట్‌మెంట్లు చూసి రాత్రిళ్లు నిద్రలేక అల్లాడుతున్నారు. అప్పట్లో 'అమెరికన్ డ్రీమ్' కోసం కన్న కలలు, ఇప్పుడు ఈఎంఐల రూపంలో పీడకలగా మారి ప్రాణం తీస్తున్నాయి. లాక్కోలేక.. పీక్కోలేక గాలిలో తేలుతున్న ఈ హెచ్1బీ కుటుంబాలను చూస్తుంటే.. "ఆశ ఎక్కువైతే ఆస్తులు కూడా ఆపదగా మారతాయ్" అనే సామెత అక్షరాలా నిజం అనిపిస్తోంది!

# అంతరిక్షంలో మరో అద్భుతం.. కొత్తగా రెండు గ్రహాలు గుర్తింపు



అనంత విశ్వంలో మన సౌర కుటుంబానికి అవతల శాస్త్రవేత్తలు మరో గొప్ప అద్భుతాన్ని వెలికితీశారు. వేల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న సుదూర అంతరిక్షంలో కొత్తగా రెండు వింత గ్రహాలను స్పెయిన్ ఖగోళ పరిశోధకులు గుర్తించారు. విశ్వంలో మనలాంటి జీవం ఎక్కడైనా ఉందా? మానవాళికి నివాసయోగ్యమైన మరో లోకం ఉందా? అనే శతాబ్దాల నాటి ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో ఇది అతిపెద్ద మైలురాయిగా నిలిచింది. ఈ కొత్త గ్రహాల గురించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**విశ్వం అంచుల్లో వెలుగుచూసిన కొత్త ప్రపంచాలు:**

ఖగోళ శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్న ఈ కొత్త గ్రహాలకు 'హూ×-1752 ఎ', 'హూ×-1752 ఇ' అని పేర్లు పెట్టారు. ఇవి మన భూమికి సుమారు 337 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'డ్రాకో' అనే నక్షత్ర మండలంలో ఉన్నాయి. ఇక అక్కడున్న ఒక చిన్న 'రెడ్ డ్వార్ఫ్ చుట్టూ ఇవి ప్రదక్షిణలు చేస్తున్నాయి. మన సూర్యుడి కంటే ఇది వేడి, పరిమాణంలో చిన్నదైనప్పటికీ, ఈ జంట గ్రహాలు సైంటిస్టులకు ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నాయి.

**నిప్పుల కొలిమిలా మొదటి గ్రహం:**

ఈ రెండు గ్రహాలలో 'హూ×-1752 ఎ' అనేది మన భూమి కంటే నాలుగు రెట్లు పెద్దదిగా ఉంది. అయితే, ఇది తన నక్షత్రానికి చాలా దగ్గరగా ఉండటం వల్ల తీవ్రమైన వేడితో నిప్పుల కొలిమిలా మండిపోతోంది. లావా రసంతో నిండిన నరకం లాంటి వాతావరణం అక్కడ ఉంది. ఇక దీనిపై ఎలాంటి జీవం మనుగడ సాగించడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

**జీవానికి అనుకూలంగా మరో 'సూపర్ ఎర్త్':**

సైంటిస్టుల కళ్లలో అసలైన ఆశలు నింపింది రెండో గ్రహమైన 'హూ×-1752 ఇ'. మన భూమి కంటే ఐదు రెట్లు బరువుండే ఈ రాతి గ్రహంపై ప్రవహించే నీరు ఉండేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అక్కడ తగినంత వాతావరణం ఉంటే జీవజాలం మనుగడకు కావలసిన నీరు సమృద్ధిగా లభించే అవకాశం ఉందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. దీంతో దీనిని మరో భూమిగా భావిస్తున్నారు.

**శాస్త్రవేత్తల పరిశోధనా పద్ధతి:**

స్పెయిన్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఆఫ్ అండలూసియా' శాస్త్రవేత్త ఆల్బెర్టో పెలేజ్ టోర్రెస్ నేతృత్వంలో ఈ అన్వేషణ

జరిగింది. నక్షత్రం కాంతిలో వచ్చే స్వల్ప మార్పులను 'ట్రాన్సిట్' పద్ధతి ద్వారా గమనించి వీటిని కనుగొన్నారు. కానరీ ఐలాండ్స్, హవాయిలోని శక్తివంతమైన 'ముస్కాట్' పరికరాలతో పాటు జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ పరిశోధకులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములయ్యారు. గ్రహాలను గుర్తించినప్పటికీ, రాబోయే రోజుల్లో స్పేస్ టెలిస్కోప్‌ల ద్వారా అక్కడ వాతావరణం, నీటి ఆనవాళ్లను పూర్తిగా విశ్లేషించాల్సి ఉంది. దట్టమైన మబ్బుల పొరలు అడ్డురాకపోతే, భవిష్యత్తులో మానవాళికి నివాసయోగ్యమైన 'రెండో భూమి' దొరికినట్లేనని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలో ఈ నూతన ఆవిష్కరణ ఒక సరికొత్త అధ్యాయానికి తెరతీసింది.

# 90 సెకన్ల ఇంటర్వ్యూ.. ఒక్క ప్రశ్నతో యూఎస్ వీసా రిజెక్ట్.. భారతీయుడి అనుభవం వైరల్




అమెరికా వెళ్లాలనేది చాలామంది భారతీయుల కల. అయితే ఎంతటి మంచి ఉద్యోగం, అర్హతలు ఉన్నప్పటికీ వీసా ఇంటర్వ్యూ క్లియర్ చేయడం మాత్రం పెద్ద సవాలుగానే మిగిలిపోతోంది. తాజాగా 34 ఏళ్ల ఒక భారతీయ ఐటీ ప్రొఫెషనల్ అనుభవించిన అమెరికా బీ1/బీ2 టూరిస్ట్ వీసా రిజెక్షన్ వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ముంబైలోని అమెరికా కాన్సులేట్‌లో కేవలం 90 సెకన్లలో ముగిసిన ఇంటర్వ్యూలో ఒక్క ప్రశ్నకు సరిగ్గా సమాధానం చెప్పలేకపోవడమే ఈ నిరాకరణకు ప్రధాన కారణమని భావిస్తున్నారు.ఈ బాధితుడు సెప్టెంబర్ 1న రెడిట్ వేదికగా తన ఇంటర్వ్యూ అనుభవాన్ని పంచుకున్నాడు. తన ప్రొఫైల్ వివరాల ప్రకారం.. అతడు డిజిటల్ ప్రొడక్ట్ మేనేజర్‌గా స్థిరమైన ఉద్యోగం చేస్తున్నాడు. వైవాహికంగా అవివాహితుడు. సుమారు మూడు వారాల పాటు చికాగో, మిచిగాన్, నయాగరా జలపాతాలను సందర్శించాలని ప్లాన్ చేసుకున్నాడు. ఈ పర్యటనకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే ఇది అతడికి మొదటి అంతర్జాతీయ ప్రయాణం కావడం గమనార్హం.

ఆగస్టు 25న బయోమెట్రిక్స్ పూర్తి చేసుకుని.. సెప్టెంబర్ 1న ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కాన్సులర్ అధికారి మొదట కొన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. భారత్‌లో లేదా తిరిగి వెళ్లే సమయంలో ఏదైనా ప్రమాదం ఉందా అని అడగ్గా 'లేదు' అని సమాధానం ఇచ్చాడు. ఆపై అతడి వృత్తి, అమెరికాలో ఒక స్నేహితుడు ఉన్న విషయాన్ని ధృవీకరించుకున్నారు.అయితే ఇంటర్వ్యూ చివరగా అధికారి అడిగిన ప్రశ్నే మొత్తం ఆటను మార్చేసింది. "మీ మొదటి అంతర్జాతీయ గమ్యస్థానంగా అమెరికానే ఎందుకు ఎంచుకున్నారు?" అని అధికారి ప్రశ్నించారు. దానికి సమాధానంగా అతడు చికాగో స్కైలైన్, నయాగరా ఫాల్స్ చూడాలనుకుంటున్నానని.. తన మూడు వారాల ట్రిప్‌కు ఈ ప్రదేశాలు సరిపోతాయని చెప్పాడు. ఈ సమాధానం ఇచ్చిన కొద్దిసేపటికే వీసా నిరాకరిస్తున్నట్లు తెలియజేస్తూ సెక్షన్ 214(బీ) కింద రిఫ్యూజల్ నోటీసును చేతిలో పెట్టారు.వీసా తిరస్కరణ తర్వాత తన దరఖాస్తును విశ్లేషించుకున్న అతడు కొన్ని కీలక విషయాలను అంగీకరించాడు. 'అమెరికాకు ఎందుకు?' అనే ప్రశ్నకు సాధారణ పర్యాటక ప్రాంతాల పేర్లు చెప్పడం కంటే భారత్‌లో తనకున్న ఉద్యోగ బాధ్యతలు, కంపెనీ ఇచ్చిన లీవ్ అప్రూవల్, పర్యటన ముగిశాక తిరిగి రావాల్సిన బలమైన కారణాలను స్పష్టంగా వివరించి ఉంటే బాగుండేదని భావించాడు. అంతేకాకుండా మొదటిసారి విదేశీ ప్రయాణం కావడం.. పెళ్లి కాకపోవడం, అక్కడ స్నేహితుడు ఉండటం వంటి అంశాలు కూడా అధికారికి అనుమానాన్ని కలిగించి ఉండవచ్చని తెలుసుకున్నాడు.ఈ ఘటన అమెరికా బీ1/బీ2 వీసా కోసం దరఖాస్తు చేసే వారికి ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతోంది. కేవలం మంచి ఉద్యోగం లేదా బ్యాంక్ బ్యాలెన్స్ ఉండటం మాత్రమే వీసాను గ్యారెంటీ చేయవు. పర్యటన పూర్తయ్యాక స్వదేశానికి తప్పక తిరిగి వస్తామనే నమ్మకాన్ని కాన్సులర్ అధికారికి కలిగించడమే అత్యంత కీలకమైన అంశం.

# పచ్చని పెళ్లి ఇంటిని శ్మశానంలా మార్చిన అమెరికా



అమెరికా-ఇరాన్ మధ్య ఇప్పటికే తీవ్ర స్థాయిలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరో ఘోర విషాదానికి దారితీశాయి. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్ సిరిక్ కౌంటీ పరిధిలోని కుహెస్తక్ ప్రాంతంలో ఒక నివాస భవనంపై అమెరికా దళాలు జరిపిన దాడి సంచలనం సృష్టించింది. అత్యంత ఆనందోత్సాహాల మధ్య వివాహ వేడుక జరుగుతున్న సమయంలో ఈ దాడి జరగడంతో ఆ ఇల్లు కాస్తా రణరంగంగా మారింది. ఈ ప్రమాదంలో ఒక పసికందుతో సహా ఐదుగురు అక్కడికక్కడే మరణించగా 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**సంతోష సమయం.. అంతట్లోనే విషాదం**

స్థానిక వర్గాల సమాచారం ప్రకారం.. దాడి జరిగిన సమయంలో ఆ భవనంలో వివాహ వేడుకకు సంబంధించిన కీలక కార్యక్రమం జరుగుతోంది. వధువు, వరుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేడుక ఘనంగా జరుగుతుండగా ఒక్కసారిగా బాంబు దాడి జరగడంతో భవనం తీవ్రంగా దెబ్బతిని శిథిలమైంది. ఇరాన్ రెడ్ క్రెసెంట్ సంస్థ ప్రారంభంలో నలుగురు చనిపోయారని ప్రకటించినప్పటికీ శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసే కొద్దీ మృతుల సంఖ్య ఐదుకు పెరిగినట్లు సమాచారం అందింది. క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**రక్షణ శాఖ సమర్థన.. అంతర్జాతీయ ఆందోళన**

అమెరికా సైన్యం మాత్రం తమ దాడులు కేవలం ఇరాన్‌కు చెందిన సైనిక స్థావరాలు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, సముద్ర ఆధారిత సైనిక మౌలిక వసతులపైనే జరుగుతున్నాయని పేర్కొంది. అయితే ప్రజా నివాసాల మధ్య ఉన్న ఈ నిర్దిష్ట భవనాన్ని అమెరికా దళాలు ఎందుకు లక్ష్యంగా చేసుకున్నాయనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

సామాన్యులు, ముఖ్యంగా చిన్న పిల్లలు బలైపోతుండటంతో అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. సైనిక చర్యల్లో పౌర నివాస ప్రాంతాలు దెబ్బతినడం తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రతీకారానికి ఇరాన్ హెచ్చరిక**

నిరపరాధులైన పౌరులు, చిన్నారి బలికావడంపై ఇరాన్ ప్రభుత్వం ఆగ్రహంతో ఊగిపోతోంది. అమెరికా చేసిన ఈ ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించిన ఇరాన్ నాయకత్వం, ఈ రక్తపాతానికి తగిన రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో రెండు దేశాల మధ్య దాడులు-ప్రతిదాడులతో యుద్ధ మేఘాలు కమ్ముకోగా ఈ తాజా ఘటన ఇరు దేశాల మధ్య వివాదాన్ని మరింత రాజేసేలా కనిపిస్తోంది.

# సహనశక్తి పరీక్ష!

భారత ఆర్థిక వృద్ధి మొదటి త్రైమాసికంలో చాలామందిని ఆశ్చర్యపరిచింది. పశ్చిమాసియా సంక్షోభ ప్రభావంతో వృద్ధి 6–7 శాతానికి తగ్గుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేయగా, 2026 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వాస్తవ వృద్ధి రేటు దృఢమైన 7.8 శాతంగా నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ అంచనా వేసిన 7 శాతం, మార్కెట్ అంచనా వేసిన 7.1 శాతంకంటే కూడా ఎక్కువ. జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, స్థిర ధరలవద్ద వాస్తవ జీడీపీ రూ.81.36 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 6.9 శాతంకంటే ఇది గణనీయమైన పెరుగుదల. నామమాత్రపు జీడీపీ 10.3 శాతం వృద్ధితో రూ.88.27 లక్షల కోట్లకు చేరగా, స్థూల విలువ జోడింపు 8.2 శాతం వృద్ధితో రూ.73.82 లక్షల కోట్లకు చేరింది. ఇది దేశీయ ఉత్పత్తి కార్యకలాపాల్లో బలమైన అంతర్లీన శక్తిని సూచిస్తోంది. ఇది కేవలం గణాంకపరమైన అస్థిరత మాత్రమే కాదు.. తయారీ, సేవా రంగాలు రెండింటిలోనూ బలమైన పనితీరు ఈ వృద్ధికి పునాది. వాస్తవానికి, తయారీ రంగం మూడు త్రైమాసికాల గరిష్ఠస్థాయిలో 9.2 శాతం వృద్ధి సాధించింది. నిర్మాణ రంగం 7.7 శాతం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు 8.9 శాతం వృద్ధి చెందడం, ద్వితీయ రంగం మొత్తంగా వృద్ధికి కీలక చోదకశక్తిగా నిలిచిందని చెప్పాలి. మూలధన వస్తువులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన కార్యకలాపాలు, ఎగుమతుల మద్దతుతో తయారీ రంగం రాణించింది. గత సెప్టెంబర్‌లో అమలు చేసిన జీఎస్టీ రేటు తగ్గింపు, 2025 మొత్తంలో రిజర్వ్ బ్యాంక్ 125 బేసిస్ పాయింట్ల మేర సంచిత వడ్డీరేట్ల కోతనుంచి ఈ రంగం ప్రయోజనం పొంది ఉండొచ్చు. ద్రవ్యోల్బణంపై అనిశ్చితి, భవిష్యత్తులో వడ్డీరేట్ల పెరుగుదల, ఇతర సాధ్యమయ్యే ప్రతికూలతలను ఊహించి కంపెనీలు తమ ఉత్పత్తిని ముందుగానే పెంచుకుని ఉండటం కూడా దీనికి కొంత కారణం కావొచ్చు. మూలధన సృష్టి కూడా ఊపందుకున్నట్టు కనిపించడం మరో శుభవార్త. ప్రభుత్వం, ప్రైవేటు రంగం మధ్య వాటా ఎంతన్నది ఇంకా స్పష్టం కాకున్నా, మొత్తంమీద మూలధన సృష్టి ఆర్థిక వ్యవస్థపై స్వాగతించదగిన గుణకార ప్రభావాన్ని చూపుతుంది. సేవారంగం కూడా బలమైన వృద్ధిని కొనసాగించడం, ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూర్చింది. ఫైనాన్స్, ఐటీ, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలవంటి ఉప రంగాలు ఇందులో కీలక పాత్ర పోషించాయి. క్యూ4 ఎఫ్‌వై26లో నమోదైన సవరించిన 8.6 శాతం వృద్ధి కంటే ఈ గణాంకం తక్కువగా ఉన్నా, ఇది వేగంలో కొత్త పురోగతి కంటే స్థిరమైన కొనసాగింపునే సూచిస్తుందన్నది నిపుణుల మాట.

అయితే, ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా సంక్షోభం నుంచి బయటపడలేదు. రాబోయే త్రైమాసికాల్లో ఈ దృఢమైన పనితీరును పునరావృతం చేయడం మరింత కష్టతరం కానుంది. ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ హెచ్చరించినట్టు, హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, చమురు ధరలను బ్యారెల్‌కు 80 డాలర్లకు పైనే ఉంచే అవకాశం ఉంది. తన చమురు అవసరాల్లో 85–90 శాతం దిగుమతి చేసుకునే దేశానికి ఇది చాలా ఎక్కువ భారం. సహేతుకమైన వాణిజ్య లోటును కొనసాగించే భారం ఇప్పటివరకూ భారత సేవా ఎగుమతులపైనే ఆధారపడి ఉంది. ఇది ఇప్పటివరకూ భారత్‌కు బాగానే ఉపయోగపడింది, కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తడబడుతోంది. దీనికితోడు, ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల వృద్ధి, భారత సేవా ఎగుమతులపై డిమాండ్‌ను భవిష్యత్తులో దెబ్బతీయవచ్చు. ఐటీ, బీపీవో రంగాల్లో సాంప్రదాయ సేవలకు ప్రత్యామ్నాయంగా ఏఐ ఆధారిత పరిష్కారాలు వేగంగా విస్తరిస్తుండటం, భారత సేవా ఎగుమతుల భవిష్యత్ పోటీతత్వంపై దీర్ఘకాలిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. వర్షాభావ రుతుపవనాలు, గ్రామీణ డిమాండ్‌పై దాని ప్రభావాన్ని ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా ఎదుర్కోవాల్సి ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో జూలై వినియోగ సంబంధిత గణాంకాలు ఇప్పటికే గ్రామీణ డిమాండ్ మందకొడిగా ఉందని సూచిస్తున్నాయి. వ్యవసాయ రంగం మొదటి త్రైమాసికంలో కేవలం 3.6 శాతం వృద్ధి మాత్రమే సాధించగా, మైనింగ్ రంగం 2.4 శాతం క్షీణించింది. ఈ రెండు రంగాల బలహీనత, గ్రామీణ ఆదాయాలపై, తద్వారా మొత్తం వినియోగ డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపించవచ్చు.

ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ సౌకర్యవంతమైన పరిధిలోనే ఉన్నా, అది క్రమంగా పెరుగుతోంది. 2026 అక్టోబర్–డిసెంబర్ నాటికి ఇది 5.9 శాతానికి చేరుతుందని రిజర్వ్ బ్యాంక్ అంచనా. ఇది డిమాండ్‌ను మరింత దెబ్బతీయవచ్చు. తయారీ రంగంలో కనిపించిన ముందస్తు ఉత్పత్తి పెరుగుదల కూడా, నిర్వచనం ప్రకారమే, రాబోయే కొన్ని త్రైమాసికాల్లో సన్నగిల్లుతుంది. కంపెనీలు భవిష్యత్ అనిశ్చితిని ఊహించి ముందుగా పేరుకున్న నిల్వలను వినియోగించుకునే కొద్దీ, తాజా ఉత్పత్తి వృద్ధి రేటు సహజంగానే మోస్తరు స్థాయికి దిగివస్తుంది. క్యూ4 ఎఫ్‌వై26లో నమోదైన సవరించిన 8.6 శాతం వృద్ధికంటే ఈ గణాంకం తక్కువగా ఉన్నా, ఇది కొత్త వేగవృద్ధి కంటే స్థిరమైన పురోగతినే సూచిస్తుందని నిపుణుల అభిప్రాయం. రిజర్వ్ బ్యాంక్ పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.7 శాతం వృద్ధి రేటును అంచనా వేస్తోంది, ఇది బలమైన తొలి త్రైమాసికం అనంతరం కొంత మోస్తరుస్థాయికి దిగివచ్చే అవకాశాన్ని సూచిస్తోంది. అమెరికా సుంకాలు, అస్థిర ముడిచమురు, ఎరువుల ధరలు వంటి బాహ్య ప్రమాదాలు ఇప్పటికీ భవిష్యత్ దృక్పథాన్ని కమ్మేస్తున్నప్పటికీ, భారత్ అంతర్లీన వృద్ధి వేగంపై నమ్మకాన్ని ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ తన ఇటీవలి పాలసీ అంచనాల్లో పేర్కొంది. భారత ఆర్థిక వ్యవస్థ సహనశక్తికి మొదటి త్రైమాసికంలో పరీక్ష ఎదురైంది, దాన్ని అది ప్రశంసనీయంగానే ఎదుర్కొంది. అయితే, మరింత కఠినమైన సహనశక్తి పరీక్ష ఇంకా ముందే ఉంది. ప్రపంచ చమురు ధరల ఒడిదొడుకులు, రుతుపవనాల అనిశ్చితి, సేవా ఎగుమతులపై పెరుగుతున్న పోటీ, ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతున్న తీరు.. ఈ నాలుగు అంశాలూ కలిసి, రాబోయే త్రైమాసికాల్లో భారత ఆర్థిక వ్యవస్థ వాస్తవ సహనశక్తిని పరీక్షించనున్నాయి. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు ఈ సవాళ్లను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశీయ డిమాండ్‌ను బలోపేతం చేయడం, తయారీ రంగం పోటీతత్వాన్ని దీర్ఘకాలికంగా కాపాడుకోవడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తగిన మద్దతునివ్వడం వంటి చర్యల ద్వారానే, ఈ ఆరంభ ఊపును ఏడాది పొడవునా కొనసాగించడం సాధ్యమవుతుంది.

# విపత్తు వెనుక దాగివున్న నిజాలు!?



నేపాల్–టిబెట్ సరిహద్దును కిందటి బుధవారం ముంచెత్తిన ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య వెయ్యికి దాటగా, దాదాపు నాలుగు వేలమంది ఆచూకీ లేకుండా పోయారు. ఆగస్టు 26న ఉదయం అకస్మాత్తుగా వరదలు మొదలైనప్పుడు, ముందుగా అత్యంత తీవ్ర విధ్వంసం సంభవించింది టిబెట్‌లోనే. టిబెట్ వైపున్న నేపాల్ సరిహద్దు వద్ద గ్యిరోంగ్ పోర్ట్ బోర్డర్ చెక్‌పాయింట్‌లో జరిగిన భారీ నష్టానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ వెలుగులోకి వచ్చింది. అందులో ప్రజలు ప్రాణాలు కాపాడుకోడానికి పరుగులు తీస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇంతటి తీవ్ర విపత్తు జరిగినా, చైనా ప్రభుత్వం మాత్రం కేవలం 16మంది మరణించారని, 546 మంది ఆచూకీ తెలియకుండా పోయారని, వీరిలో 261మంది విదేశీ పౌరులున్నారని అధికారికంగా ధృవీకరించింది. దాదాపు 500 మంది భారతీయ పౌరులు చైనావైపు సురక్షితంగా ఉన్నారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆగస్టు 30న వెల్లడించింది. అయితే, ఇంటర్‌నేషనల్ క్యాంపెయిన్ ఫర్ టిబెట్ అనే సంస్థ మాత్రం, ఈ ఘటనలో కనీసం 300 ఇళ్లు ధ్వంసమయ్యాయని, మృతుల సంఖ్య అధికారికంగా ప్రకటించిన దానికంటే చాలా ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. టిబెట్‌లో స్వతంత్రంగా గణాంకాలను ధృవీకరించడం ఎందుకు కష్టమో అర్థం చేసుకోవాలంటే, అక్కడ విదేశీ జర్నలిస్టులు ఎదుర్కొనే కఠిన ఆంక్షలను గమనించాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా టిబెట్‌కు వెళ్లడం నిషేధం. గ్యిరోంగ్ పోర్ట్‌కు సంబంధించిన వైరల్ వీడియోలో ఒక భవనం మొత్తం వరద నీటిలో కొట్టుకుపోతున్న దృశ్యం కనిపిస్తుండగా, ఈ ఫుటేజీని చైనాలో సెన్సార్ చేస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా ధృవీకరించింది. ఈ సెన్సార్‌షిప్‌పై ప్రశ్నించినప్పుడు, సహాయక, రక్షణ చర్యలను వెంటనే ప్రారంభించి, క్రమబద్ధంగా కొనసాగిస్తున్నామని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి బదులిచ్చారు. విపత్తును ఉపయోగించుకుని దేశాన్ని ఉద్దేశపూర్వకంగా చెడుగా చూపించడానికి, పరిస్థితిని అతిశయోక్తిగా చిత్రీకరించడానికి చేసే ప్రయత్నాలకు ప్రజల మద్దతు లభించదని ఆయన స్పష్టం చేశారు. ఈ వైఖరికి అనుగుణంగానే, "తప్పుడు విపత్తు సమాచారం" వ్యాప్తి చేశారన్న ఆరోపణలతో పదిమందిపై చైనా అధికారులు చర్యలు తీసుకున్నారు. టిబెట్‌లో సంభవించిన మరణాలపై సోషల్ మీడియాలో వేలాది మంది మరణించారని, అధికారికంగా వెల్లడించిన సంఖ్యకంటే ఎక్కువ మంది గల్లంతయ్యారని పేర్కొంటూ పోస్టులు వ్యాప్తి చెందడాన్నే ఇందుకు కారణంగా చూపారు. అయితే, ఈ పదిమందికి విధించిన శిక్షలేమిటో, వారు ఏ వేదికలపై ఈ సమాచారాన్ని పంచుకున్నారో మాత్రం అధికారులు వెల్లడించలేదు. ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ ఫర్ టిబెట్ సంస్థ ప్రకారం, సెల్, సెర్‌చుంగ్, లాబీ, రిజీ అనే నాలుగు గ్రామాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అక్కడ దాదాపు 300 ఇళ్లు ధ్వంసమయ్యాయి, ఇంకా చాలామంది ఆచూకీ తెలియలేదు. ప్రాణాలతో బయటపడినవారిని వరద ప్రభావిత సరిహద్దు ప్రాంతానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని గ్యిరోంగ్‌కు తరలించి, కఠినమైన నిఘాలో ఉంచారని, వారితో స్వేచ్ఛగా మాట్లాడటానికి అనుమతి లేదని కూడా ఆ సంస్థ వెల్లడించింది.

చైనానుంచి సున్నితమైన సమాచారం కొద్దికొద్దిగా మాత్రమే బయటకు రావడం ఇదే మొదటిసారి కాదు. 2020లో కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి చెందిన తర్వాత కూడా ఇదే తరహా వైఖరి ప్రపంచం చూసింది. ఇది కేవలం నేపాల్‌లోనే జరుగుతున్నట్టు, సరిహద్దుకు అవతల ఏమీ జరగనట్టు చిత్రీకరించే ధోరణి, ఏ సంక్షోభాన్నైనా అసలు సంక్షోభమే లేనట్టుగా ఎదుర్కొనే చైనా ప్రభుత్వ శైలికి అద్దం పడుతుంది. గ్యిరోంగ్ పోర్ట్ సీసీటీవీ ఫుటేజీ ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయినా, ఆ ఫుటేజీలోని కేవలం ఒక్క చిత్రాన్ని మాత్రమే చైనా ప్రభుత్వ టీవీ చానళ్లు తమ ప్రసారాల్లో చూపించడం గమనార్హం. చైనాలో అత్యంత కఠినమైన ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ కారణంగా పూర్తి వీడియోను కనుగొనడం కష్టతరమే అయినా, ఈ విపత్తుకు సంబంధించిన వివిధ అంశాలపై దేశీయంగా ఆన్‌లైన్ చర్చ మాత్రం కొనసాగుతోంది. ఆకస్మిక వరదల గురించి చెబుతున్న ప్రాణాలతో బయటపడినవారి ప్రత్యక్ష వివరాలను కనుగొనడం ఇప్పటికీ కష్టతరంగానే మిగిలింది. అయితే, వరదల అనంతరం చైనా అనుసరిస్తున్న ఈ వైఖరిని బట్టి ఆ దేశం నిర్లక్ష్యంగా ఉందని భావించలేం. వాస్తవానికి, చైనా ప్రీమియర్ లీ కియాంగ్‌ను వెంటనే ఆ ప్రాంతానికి పంపడం, శిథిలాలు తొలగించే పనిని ఆయన స్వయంగా పరిశీలించడం, దేశంలో రెండో అత్యున్నత నాయకుడు ఇంతటి తీవ్ర విపత్తు అనంతరం వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లడం అరుదైన విషయమేనని స్పష్టం చేస్తుంది. అంటే, బయటకు కనిపిస్తున్న ప్రశాంతమైన స్పందనకు వెనుక, తీవ్రమైన అంతర్గత ఆందోళనే దాగుందని అర్థం చేసుకోవచ్చు.

ఈ ఆందోళనకు కారణాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. దేశంలో ఎప్పుడూ స్థిరత్వం కొనసాగించాలని కోరుకునే చైనా కమ్యూనిస్టు పార్టీ, ఇలాంటి విపత్తుకు సరిగ్గా స్పందించలేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని భయపడుతుంది. అంతేకాక, ఈ విషాద ఘటన ప్రభావం మరింత పెద్ద సమస్యగా మారుతుందేమోనన్న ఆందోళన కూడా ఉండొచ్చు. ముఖ్యంగా, చాలాకాలంగా విశ్వాసం, ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషిస్తున్న టిబెటన్ సమాజంలో ఇది మరింత సున్నితమైన అంశం. ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా బహిరంగ నిరసనలు జరగనప్పటికీ, విదేశాల్లోని టిబెటన్ సంస్థలు చైనా తన నియంత్రణను క్రమంగా పెంచుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉదాహరణకు, మఠాలు, బౌద్ధమతం పాత్రను బలహీనపరచడమే లక్ష్యంగా రూపొందించిన కొత్త విద్యా చట్టం విషయంలో వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో, ప్రకృతి విపత్తు సమాచారాన్ని కూడా అత్యంత జాగ్రత్తగా, నియంత్రిత రీతిలో వెల్లడించడం ద్వారా, ఏ చిన్న అసంతృప్తి కూడా విస్తృత అసమ్మతిగా మారకుండా చైనా ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. అయితే, ఇలాంటి పారదర్శకత లోపం, అంతర్జాతీయ సమాజంలో చైనాపై నమ్మకాన్ని మరింత దెబ్బతీసే ప్రమాదం ఉంది. ప్రకృతి విపత్తులు దేశాల సరిహద్దులను, రాజకీయ వ్యవస్థలను చూడవు. అవి మానవాళి అందరికీ ఉమ్మడి సవాలు. అలాంటప్పుడు, నిజమైన సమాచారాన్ని దాచిపెట్టడం కంటే, పారదర్శకంగా వ్యవహరించడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని, అంతర్జాతీయ సహకారాన్ని పొందగలమన్న సత్యాన్ని చైనా గుర్తించాలి. మృతుల సంఖ్య ఎంతైనా, ప్రతి ప్రాణానికీ విలువ ఉంటుంది. ఆ నిజాన్ని దాచిపెట్టడం ద్వారా ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా తప్పించుకోలేదు! ■

## పనికొచ్చే పలుకు




# వొళ్లొంచకుంటే.. ప్రాణానికే ముప్పు!

"శారీరక శ్రమను పెంచుకుంటే ఆయుష్షు పెరుగుతుంది" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. కదలికల్లేని ఆధునిక జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఇది వైద్య ఆరోగ్య రంగంపై తీవ్రమైన భారాన్ని మోపుతోందని గతంలో విడుదల చేసిన మార్గదర్శకాల్లో సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. మోటారు వాహనాల వాడకం పెరగడం, ఉద్యోగం, చదువు, వినోదం కోసం రోజంతా స్క్రీన్లముందు గడపడంవల్ల ఆధునిక జీవితం పూర్తిగా నిశ్చలంగా మారిపోయిందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. శారీరక శ్రమ లేకపోవడం వల్లనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నట్టు డబ్ల్యూహెచ్‌వో తేల్చిచెప్పింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం శారీరక శ్రమ చేయని వ్యక్తులకు మరణ ముప్పు 20 నుంచి 30 శాతం ఎక్కువట. పిల్లలు, కౌమార దశలో ఉన్నవారు రోజూ శారీరకంగా చురుగ్గా ఉంటే దేహదారుఢ్యం, ఎముకల బలం, మానసిక ఉల్లాసం పెరుగుతాయి. అదే సమయంలో ఎక్కువ సమయం కూర్చునే అలవాటు ఉంటే నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. పెద్దలు, వృద్ధులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహంవంటి ప్రాణాంతక సమస్యల బారిన పడే ముప్పు తగ్గుతుంది. గంటల తరబడి కదలకుండా కూర్చుంటే క్యాన్సర్ రిస్క్ విపరీతంగా పెరుగుతుంది.

గర్భిణులు, బాలింతలు శారీరకంగా చురుగ్గా ఉంటే ప్రసవ సమయాల్లో ఇబ్బందులు తొలగిపోవడంతోపాటు ప్రసవానంతర డిప్రెషన్ దూరం అవుతుంది. వ్యాయామంవల్ల పుట్టబోయే బిడ్డ బరువుపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండదని సంస్థ స్పష్టం చేసింది. ఐదేళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ప్రతి ఒక్కరూ తగిన మోతాదులో వ్యాయామం చేయాలని డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. అసలు శారీరక శ్రమ చేయకపోవడం కంటే ఏదోక రూపంలో శ్రమ చేయడం ఎంతో మేలని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవాటు చేసుకోవాలని నిపుణులు తేల్చిచెప్పారు. ఐదేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేకంగా స్క్రీన్ టైమ్‌ను తగ్గించేలా 24 గంటల నిద్ర, ఆటపాటల దినచర్యను రూపొందించాలని సూచించారు.


నిపుణుల ప్రకారం.. శరీర కండరాల కదలికల ద్వారా శక్తిని ఖర్చు చేసే ప్రతి పద్ధతినీ శారీరక శ్రమగా పరిగణించవచ్చు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేటప్పుడు, ప్రయాణ సమయాల్లో, లేదా ఇళ్లలో పనులు చేసేటప్పుడు చేసే ప్రతి చిన్న కదలిక దీని కిందకే వస్తుంది. నడక, సైక్లింగ్, క్రీడలువంటి తేలికపాటి లేదా తీవ్రమైన వ్యాయామాలు అన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎటువంటి నైపుణ్యాలతోనైనా, ఏ వయసువారైనా వీటిని సులభంగా ఆచరించవచ్చు.



నిద్రలేమి కేవలం శారీరక శక్తినే కాదు, సరైన నిర్ణయాలు తీసుకునే మెదడు సామర్థ్యాన్నే మార్చేస్తుంది. తగినంత నిద్రలేనప్పుడు ఆలోచనలపై నియంత్రణ సన్నగిల్లి, మనసు పాత అలవాట్లు, చెడు కోరికల వైపు సులభంగా జారిపోతుంది. నిర్ణయశక్తి బలహీనపడి, ప్రలోభాలను నిరోధించే సామర్థ్యం తగ్గిపోతుంది. కాబట్టి, ప్రవర్తనను, ఆలోచనలను నియంత్రణలో ఉంచుకోవాలంటే, తగినంత నిద్రను ఒక ప్రాధాన్యతగా తీసుకోవడం అత్యవసరం. సో, నిద్ర లేకపోవడం అంటే కేవలం అలసటే కాదు, మంచి నిర్ణయాలను కోల్పోవడం కూడా!

-మహాదేవ

## వింతల్లో వింతలు



అమెరికాలోని హ్యూస్టన్‌కు చెందిన కియాంటే మ్యాట్‌లాక్‌కు ఒక వింత అనుభవం ఎదురైంది. 'డోర్‌డాష్' ద్వారా బర్గర్ కింగ్ ఆర్డర్ చేయగా, డెలివరీ డ్రైవర్ పూర్తిగా నగ్నంగా వచ్చి ఆహారాన్ని తలుపు వద్ద వదిలివెళ్లడం ఆయన సెక్యూరిటీ కెమెరాలో రికార్డయింది! మొదట అతను ఏదో ప్రత్యేక దుస్తులు ధరించారేమో అనుకున్నా, పరిశీలించగా అది నిజంగానే నగ్న శరీరమని గ్రహించి కియాంటే దిగ్భ్రాంతికి గురయ్యాడు. తలుపు వద్దకు వెళ్లేసరికే డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తన కూతురో లేదా మరో మహిళో తలుపు తీసి ఉంటే పరిస్థితి ఏమయ్యేదో అని ఆందోళన వ్యక్తం చేసిన కియాంటే, ఆ ఆహారాన్ని తినడానికి నిరాకరించాడు. దీనిపై స్పందించిన డోర్‌డాష్ సంస్థ, వెంటనే డబ్బు వాపసు చేయడంతోపాటు, ఆ డ్రైవర్‌ను తమ ప్లాట్‌ఫామ్ నుంచి శాశ్వతంగా తొలగించింది. ఇలాంటి ప్రవర్తనను ఏమాత్రం సహించబోమని సంస్థ స్పష్టం చేసింది.

# 'వెంటాడే' దగ్గు

ఒకట్రెండు సార్లు దగ్గితే? పొలమారిందేమో అనుకుంటాం. ఒకట్రెండు రోజులుగా దగ్గుతుంటే? జలుబు, ఫ్లూ కావొచ్చని భావిస్తాం. వారమైనా తగ్గకపోతే? అలర్జీ, బ్రాంకైటిస్ వంటి సమస్యలు మనసులో మెదలుతాయి. మూడు, నాలుగు వారాలు దాటినా వేధిస్తుంటే? ఏమైందో ఏమోననే భయం పుట్టటం ఖాయం. నిజానికి జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటి వాటితో వచ్చే దగ్గు ఆయా సమస్యలు నయం కాగానే తగ్గుతుంది. కానీ దీర్ఘకాల దగ్గు అలా కాదు. వారాలు, నెలల తరబడి వెంటాడుతూ వస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేయటానికి లేదు.

సాధారణంగా దగ్గు రాగానే కంగారుపడతాం. కానీ అది మన శ్వాసకోశ వ్యవస్థను కాపాడే సహజ రక్షణ ప్రక్రియ. శ్వాసనాళాల్లోకి ధూళి, దుమ్ము లేదా క్రిములు చేరినప్పుడో.. కఫం (శ్లేష్మం) బాగా పేరుకున్నప్పుడో శరీరం వాటిని బయటకు పంపడానికి దగ్గు రూపంలోనే స్పందిస్తుంది. శ్వాసనాళాల్లోనే కాకుండా చెవి, ముక్కు చుట్టుపక్కల సైనస్ గదులు, గొంతు, అన్నవాహిక వంటి భాగాల్లోనూ అత్యంత సున్నితమైన నాడీ కణాలు ఉంటాయి. శ్వాసనాళాల్లో ఏదైనా నస లేదా ఆటంకం ఏర్పడగానే ఇవి వేగస్ నాడి ద్వారా మెదడుకు సంకేతాన్ని పంపుతాయి. దాన్ని అందుకున్న మెదడు వెంటనే శ్వాసకోశ, గొంతు కండరాలను బలంగా ఒత్తిడికి గురిచేసి గాలిని వేగంగా బయటకు నెట్టేలా ఆదేశిస్తుంది. ఈ క్రమంలోనే దగ్గు పుడుతుంది. అనవసరమైనవి లోపలికి పోకుండా కాపాడే ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యానికి ఎంతో కీలకం. అయితే దగ్గు అన్నిసార్లూ మంచిదే అనుకోవటానికి లేదు.

కాలాన్ని బట్టి రకాలు

**దగ్గు ఎంతకాలంగా వస్తుందనే దాన్ని బట్టి తీవ్రత, రకాలు ఆధారపడి ఉంటాయి.**

అక్యూట్: మూడు వారాల కన్నా తక్కువ కాలం ఉండేది అక్యూట్ రకం. ఇది చాలావరకూ సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లతో వస్తుంది. అయితే పిల్లల్లో శ్వాసనాళాల్లోకి ఆహారం, ద్రవాలు పోవటం, ఊపిరితిత్తుల్లో వాపు ప్రక్రియతోనూ రావొచ్చు.

సబ్ అక్యూట్: మూడు నుంచి ఎనిమిది వారాల వరకు ఉండేది.

క్రానిక్: ఎనిమిది వారాలకు మించి కొనసాగేది క్రానిక్ రకం. ఇది చాలా విసుగు కలిగిస్తుంది. అంతేకాదు, నిద్ర సరిగా పట్టకపోవటం, తీవ్ర అలసట వంటి ఇబ్బందులకూ గురిచేస్తుంది. రెండు నెలలు దాటినా దగ్గు తగ్గకపోతే ఊపిరితిత్తుల్లో తీవ్రమైన సమస్యలు, క్యాన్సర్ కణితులు, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ) వంటి జబ్బులు ఉన్నాయేమోనని నిశితంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సొంత వైద్యంతో, దగ్గు మందులతో తాత్కాలికంగా లక్షణాలను అణచివేయటం సరికాదు. దగ్గును ఒక జబ్బుకు సంకేతంగా మాత్రమే కాకుండా, దానికదే ఒక ప్రత్యేక సమస్యగా భావించాల్సి ఉంటుంది. దగ్గుకు కారణమవుతున్న అంశాలను గుర్తించి చికిత్స చేయటం చాలా ముఖ్యం.

**ఇతర లక్షణాలూ..**

**దీర్ఘకాలిక దగ్గులో కొన్ని ఇతర లక్షణాలూ కనిపించొచ్చు.**

ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ
గొంతు వెనుక భాగంలో కఫం జారటం (పోస్ట్‌నాసల్ డ్రిప్)
తరచూ గొంతును సరిచేసుకోవడం
గొంతు నొప్పి
బొంగురు గొంతు (స్వరం మారడం)
ఆయాసం, గాలి సరిగా అందకపోవటం (పిల్లనగ్రోవి ఊదినట్లు పిల్లికూతలు)
ఛాతీలో మంట (అసిడిటీ), నోట్లోకి పుల్లటి నీరు రావటం
దగ్గినప్పుడు అరుదుగా రక్తం పడటం

**ప్రధాన కారణాలు ఇవీ..**

**1. బీపీ మందులు**

అధిక రక్తపోటు, గుండె జబ్బుల కోసం క్రమం తప్పకుండా వాడే ఏసీఈ ఇన్‌హిబిటార్స్ రకం మందులు శ్వాసకోశ వ్యవస్థలో బ్రాడీకినిన్, సబ్‌స్టాన్స్-పి అనే రసాయనాలు పేరుకుపోయేలా చేస్తాయి. దీంతో 5-35% మందిలో పొడి దగ్గు వస్తుంటుంది. పొగతాగే అలవాటు లేనివారిలోనూ ఇది కనిపిస్తుంది.
గుర్తించటం: మొదటి మోతాదు మందు వేసుకున్న కొద్ది గంటల్లోనే దగ్గు రావచ్చు. కొందరికి కొన్ని నెలల తర్వాతా రావచ్చు.
పరిష్కారం: వైద్యుల సలహాతో బీపీ మందును పూర్తిగా ఆపేసి, ప్రత్యామ్నాయ మందులను వాడుకోవచ్చు. మందు ఆపిన 1- 4 వారాల్లో దగ్గు తగ్గుతుంది.

**2. ఆస్థమా, శ్వాసనాళాల వాపు**

ఆస్థమాతో తలెత్తే దగ్గు ఆయా కాలాలను బట్టి వస్తుంటుంది, పోతుంటుంది. ఇది శ్వాసకోశ ఇన్ఫెక్షన్ తర్వాత కనిపించొచ్చు. చల్ల గాలి, కొన్ని రసాయనాలు, సువాసనలతో మరింత ఎక్కువ కావచ్చు. శ్వాసనాళాల్లో ఇసినోఫిల్స్ అనే తెల్ల రక్తకణాలు పెరగడం వల్ల వచ్చే కాఫ్-వేరియంట్ రకం ఆస్థమాలో ప్రధాన లక్షణం దగ్గు మాత్రమే.
గుర్తించటం: ఆయాసం స్పష్టంగా లేకపోయినా రాత్రి వేళల్లో పొడిదగ్గు తీవ్రమవుతుంది. రక్తంలో ఇసినోఫిల్స్ సంఖ్య, ఉచ్ఛ్వాస పరీక్ష ద్వారా దీన్ని నిర్ధారించొచ్చు.
పరిష్కారం: ఇన్‌హేలర్ ద్వారా పీల్చుకునే కార్టికోస్టెరాయిడ్స్ మేలు చేస్తాయి. అవసరమైతే శ్వాసనాళాల వాపు తగ్గటానికి నోటితో స్టెరాయిడ్లు తీసుకోవాల్సి ఉంటుంది.

**3. ముక్కు, సైనస్ సమస్యలు**

ముక్కు, దాని చుట్టుపక్కల గాలిగదుల వాపు (సైనసైటిస్) సమస్యలూ దగ్గుకు దారితీస్తుంటాయి. ముక్కు దిబ్బడ, ముఖంలో నొప్పి, వాసన తెలియకపోవడం వంటివి దీర్ఘకాలం ఉన్నట్టయితే శ్లేష్మం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంటుంది. ఇది గొంతు వెనుక భాగంలోకి చుక్కలు చుక్కలుగా జారటం (పోస్ట్ నాసల్ డ్రిప్) దగ్గుకు దారితీస్తుంది. దీన్నే అప్పర్ ఎయిర్‌వే కాఫ్ సిండ్రోమ్ అనీ అంటారు.
పరిష్కారం: యాంటిహిస్టమైన్లు, స్టెరాయిడ్ నాసల్ స్ప్రే, ఉప్పు నీటితో ముక్కు శుభ్రం చేసుకోవటం (సలైన్ వాషింగ్) ద్వారా ఉపశమనం లభిస్తుంది.

**4. ఆమ్లం గొంతులోకి రావటం**

జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఎగదన్నుకు రావటం (జీఈఆర్‌డీ) వల్ల ఛాతీలో మంట మాత్రమే కాదు, అన్నవాహిక చికాకుకు గురై దగ్గూ వస్తుంది. దీంతో జీఈఆర్‌డీ మరింత ఎక్కువవుతుంది కూడా. చివరికిదో విషవలయంగా మారుతుంది. విపరీతమైన గురక పెట్టటం, ఊబకాయం మూలంగానూ ఆమ్లం ఎగదన్నుకొచ్చి, దగ్గు రావచ్చు.
పరిష్కారం: ఛాతీమంట తగ్గించే పీపీఐ రకం మందులతో పాటు బరువు తగ్గటం, తిన్న వెంటనే పడుకోకపోవటం వంటి జీవనశైలి మార్పులు మేలు చేస్తాయి.

**5. ఇన్ఫెక్షన్లు**

న్యుమోనియా, ఫ్లూ, జలుబు వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు తగ్గినా, దగ్గు చాలాకాలం ఉండొచ్చు. పెద్దవారిలో దీర్ఘకాలిక దగ్గుకు కారణమయ్యే, పెద్దగా పట్టించుకోని మరో సమస్య కోరింత దగ్గు (పర్టుసిస్). ఊపిరితిత్తుల్లో తలెత్తే ఫంగల్ ఇన్ఫెక్షన్లు, క్షయ.. నేల, నీరు, దుమ్ములో ఉండే నాన్-ట్యూబర్క్యులస్ మైకోబాక్టీరియా (ఎన్‌టీఎం) కూడా దీర్ఘకాలిక దగ్గుకు దారితీయొచ్చు.

**6. పొగ తాగటం, వాయు కాలుష్యం**

సిగరెట్లు, చుట్టలు, బీడీలు, ఇ-సిగరెట్లు తాగటం వల్ల శ్వాసనాళాల్లో దీర్ఘకాల బ్రాంకైటిస్ తలెత్తి, ఉదయాన్నే కఫంతో కూడిన దగ్గు వస్తుంది. వాయు కాలుష్యమూ కారణం కావొచ్చు.
పరిష్కారం: పొగ తాగటం మానెయ్యాలి. అవసరమైతే నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవాలి. రసాయనాలు/ధూళి కాలుష్యానికి దూరంగా ఉండాలి.

**7. క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ)**

ఇది ఊపిరితిత్తుల నుంచి గాలి ప్రవాహాన్ని అడ్డుకునే దీర్ఘకాలిక శ్వాసకోశ జబ్బు. ఇందులో క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫిసెమా అనే రెండు రకాలుంటాయి. క్రానిక్ బ్రాంకైటిస్‌లో రంగు మారిన కఫంతో దగ్గు వస్తుంది. ఎంఫిసెమా ఊపిరితిత్తుల్లోని గాలి సంచులను దెబ్బతీసి ఆయాసానికి దారితీస్తుంది.

**సీఓపీడీ గలవారిలో ఎక్కువమంది పొగతాగేవారు, ఒకప్పుడు పొగతాగినవారే అయ్యింటారు.**

**అరుదైన కారణాలు**

పొలమారటం (ఆస్పిరేషన్), శ్వాసనాళాలు వెడల్పయి దెబ్బతినడం వల్ల శ్లేష్మాన్ని బయటకు పంపే సామర్థ్యం తగ్గటం (బ్రాంకియెక్టాసిస్), ఊపిరితిత్తులలోని చిన్న శ్వాసనాళాల్లో వాపు, చికాకు, శ్లేష్మం పేరుకుపోయేలా చేసే ఇన్ఫెక్షన్ (బ్రాంకియోలైటిస్), ఊపిరితిత్తులు, జీర్ణ వ్యవస్థ, ఇతర అవయవాలను ప్రభావితం చేసే జన్యులోపం (సిస్టిక్ ఫైబ్రోసిస్), ఇదమిత్థమైన కారణం తెలియకుండా ఊపిరితిత్తులు క్రమంగా దెబ్బతిని గట్టిపడటం (ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్), ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్థమా లేకపోయినా శ్వాసనాళాలు వాయటం (నాన్-ఆస్థమాటిక్ ఈసినోఫిలిక్ బ్రాంకైటిస్), ఊపిరితిత్తుల్లో కణితులు (సార్కాయిడోసిస్) వంటివి.

**ఇవి ప్రమాదకర లక్షణాలు**

దగ్గుతో పాటు కఫంలో రక్తం పడటం
తీవ్రమైన ఆయాసం, శ్వాస తీసుకోలేకపోవటం
అకారణంగా బరువు తగ్గిపోవటం
రాత్రి వేళల్లో విపరీతంగా చెమటలు, జ్వరం రావటం
ఛాతీ భాగంలో తీవ్రమైన నొప్పి - ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తాత్సారం చేయరాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

**దగ్గు కేవలం తాత్కాలిక అసౌకర్యమే కాకపోవచ్చు. అది ఊపిరితిత్తుల్లో దాగిన సమస్యకు తొలి హెచ్చరిక కావచ్చు! కారణాన్ని సరిగ్గా గుర్తించి, సరైన చికిత్స తీసుకోవటమే ఊపిరితిత్తుల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష.**

# స్కూల్ పిల్లలకు లంచ్ లో ఈ పదార్థాలు పెట్టొద్దట..

## ఇన్ స్టంట్ నూడుల్స్ తో అనారోగ్య సమస్యలు

## స్వీట్లు, ఫ్రై చేసిన పదార్థాలను దూరం పెట్టాల్సిందే

## తాజా పండ్లు, కూరగాయలకు లంచ్ బాక్సులో చోటివ్వాలి

## పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేయాలంటున్న నిపుణులు



వేసవి సెలవులు ముగిశాయి.. స్కూళ్లు తెరుచుకుని పదిహేను రోజులు కావొస్తున్నా ఇప్పుడిప్పుడే క్లాస్ రూంలు నిండుగా కనిపిస్తున్నాయి. భుజాన బ్యాగు, చేతిలో లంచ్ బాస్కెట్లతో పిల్లలు స్కూళ్లకు వెళుతున్నారు. మరి ఆ లంచ్ బాక్సుల్లో ఏం పెడుతున్నారు.. పిల్లలకు ఇష్టమనో లేక వంటింట్లో హడావుడి వల్లో ఫాస్ట్ ఫుడ్ పెడితే మాత్రం పిల్లలను చేజేతులా అనారోగ్యాల పాలు చేస్తున్నట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నూడుల్స్, స్వీట్లు, ఫ్రై చేసిన పదార్థాలు, రాత్రిపూట మిగిలిన ఆహారం వేడి చేసి పెట్టడం లాంటివి మీ పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని అంటున్నారు. ఇన్ స్టంట్ నూడుల్స్ ను ఇష్టపడని పిల్లలు ఉండరనడంలో అతిశయోక్తి లేదు.. అయితే, మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇన్ స్టంట్ నూడిల్స్ లో చాలావరకు కాలరీస్, ఫైబర్, సోడియం సహా పలు రకాల మైక్రోన్యూట్రియెంట్లు తక్కువ మోతాదులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పైగా తరచూ నూడుల్స్ తినడం వల్ల గుండె, కిడ్నీలకు సంబంధించిన అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందంటున్నారు. ఇక నూనెలో బాగా ఫ్రై చేసిన ఆహార పదార్థాలు.. ఫ్రెంచ్ ఫ్రైస్, పొటాటో చిప్స్, ఫ్రైడ్ చికెన్ నగ్గెట్స్ వంటివి పొట్టలోని పేగుల పనితీరుపై చెడు ప్రభావం చూపుతాయట. వీటితో పిల్లలు లావయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి అవసరమైన న్యూట్రిషన్ ఫుడ్ తో లంచ్ బాక్స్ సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. పిల్లలు కోరుకునే రుచితో పాటు ఆరోగ్యకరమైన ఆహారం సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలని అంటున్నారు. తాజా కూరగాయలు, పండ్లు, ప్రొటీన్లతో నిండిన శాండ్ విచ్, పాన్ కేకులు, ఇడ్లీలకు లంచ్ బాక్సుల్లో చోటివ్వాలని సలహా ఇస్తున్నారు.

# మీ పిల్లలు ఊరికే కోపగించుకుంటున్నారా.. అయితే బీపీ కావచ్చు.. చెక్ చేయండి

ప్రపంచంలో అధిక రక్తపోటు సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇది ఇప్పుడు చిన్నారులకూ వ్యాప్తిస్తుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 3% నుంచి 6% మంది పిల్లలు కౌమారదశలో అధిక రక్తపోటు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మారుతున్న జీవనశైలి దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అంతే కాకుండా స్థూలకాయం కారణంగా పిల్లలు, యుక్తవయస్కుల్లో చాలా సందర్భాలలో అధిక రక్తపోటు సమస్య కనిపిస్తోంది. 12 నుంచి 16 ఏళ్లలోపు పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అసాధారణ హృదయ స్పందన, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడితో కూడిన వాతావరణం, ఆహారంలో సమతుల్యత లోపించడం కూడా కారణమని, కాబట్టి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని అంటున్నారు.



**కారణాలు**

జీవనశైలిలో మార్పులు
ఊబకాయం, అధిక శరీర ద్రవ్యరాశి సూచిక లేదా %దీవీ×
ఒత్తిడితో కూడిన వాతావరణం, ఆహారంలో సమతుల్యత లేకపోవడం
పిజ్జా, బర్గర్లు, కూల్ డ్రింక్స్ (శీతల పానీయాలు) అధిక రక్తపోటును కలిగిస్తాయి
మొబైల్ వినియోగం టీనేజర్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది
కొందరిలో ఒత్తిడి వల్ల తాత్కాలికంగా వస్తుంది
కొన్ని అధిక రక్తపోటు అనేది బ్రెయిన్ స్ట్రోక్‌కి కూడా దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అధిక రక్తపోటును నివారించే మార్గాలు

ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం
మెదడుకు అవసరమైన విశ్రాంతి ఇవ్వడం
అప్రమత్తంగా ఉండటం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం
పిల్లలు యుక్తవయసులో తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండడం
అసాధారణ హృదయ స్పందన రేటు, తలనొప్పి, శ్వాస సమస్యల కోసం వైద్యుడిని సంప్రదించాలి.

# ఈ ఐదు శరీర భాగాల్లో వాపు కనిపిస్తే దేనికి సంకేతమో తెలుసా...!

## అప్పుడప్పుడు శరీర భాగాల్లో వాపు

## తొడలు, పిక్కలు, మడమలు, చేతివేళ్లు, పొట్ట భాగాల్లో వాపు కనిపిస్తే డేంజర్

## లివర్ సిర్రోసిస్ కు సంకేతాలంటున్న వైద్య నిపుణులు

## ఏమాత్రం అజాగ్రత్తగా ఉండరాదని వెల్లడి

మానవ దేహం అనేక సంక్లిష్ట వ్యవస్థల సమాహారం. ఈ వ్యవస్థలో ఎక్కడ అనారోగ్యం తలెత్తినా, అది ఇతర భాగాలపై ప్రభావం చూపుతుంది. మన శరీర భాగాల్లో అప్పుడప్పుడు వాపు కనిపించడం తెలిసిందే. అయితే, ప్రత్యేకించి మన దేహంలోని 5 భాగాల్లో వాపు కనిపిస్తే జాగ్రత్తగా ఉండాల్సిందేనని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తొడలు, పిక్కలు, మడమలు, చేతి వేళ్లు, పొట్ట భాగాల్లో వాపు కనిపిస్తే దాన్ని తేలిగ్గా తీసుకోరాదు. ఆ వాపులు కాలేయం తీవ్ర అనారోగ్యం బారిన పడిందనడానికి సంకేతాలుగా భావించాల్సి ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడేవారిలో ఈ వాపులు కనిపిస్తాయి. శరీరంలో అత్యంత కీలక అవయవం కాలేయం. ఇది మానవ దేహంలో 500కి పైగా జీవ క్రియలకు తోడ్పాటు అందిస్తుందంటే నమ్మలేం... కానీ ఇది నిజం. తిన్న ఆహారాన్ని జీర్ణం చేయడం, వ్యాధులతో పోరాటం, రక్తం నుంచి విషపూరిత మలినాలను తొలగించడం వంటి అత్యంత కీలక చర్యలను కాలేయం నిర్వర్తిస్తుంది. అలాంటి కాలేయానికి ఏదైనా హాని జరిగితే దాని ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. సరైన ఆహారపు అలవాట్లు లేనివారిలో, చెడు తిండ్లు తినేవారిలో, శరీరానికి తగినంత వ్యాయామం లేనప్పుడు, అధిక బరువుతో బాధపడేవారిలో కాలేయం చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఈ పరిస్థితిని ఫ్యాటీ లివర్ గా పరిగణిస్తారు. ఫ్యాటీ లివర్ కారణంగా... కాలేయం పనితీరు మందగించి శరీర జీవక్రియలు అస్తవ్యస్తం అవుతాయి. సిర్రోసిస్ అనేది ఫ్యాటీ లివర్ లో చివరి దశ. ఇది ప్రాణాంతకమైనది. కాలేయం సిరోసిస్ దశకు చేరుకున్నప్పుడు శరీరంలో ఐదు భాగాల్లో వాపు కనిపిస్తుంది. కాలేయం సరిగా పనిచేయనప్పుడు, పరిమాణంలో మరింత పెరిగినప్పుడు నరాలపై ఒత్తిడి పడుతుంది. కాలేయంలో రక్త సరఫరాకు అవాంతరాలు ఏర్పడతాయి. దాంతో కిడ్నీలకు రక్త సరఫరా తగ్గడం, కిడ్నీలు రక్తంలో పేరుకుపోయిన అధికమోతాదులో ఉన్న లవణాలను తొలగించలేకపోవడం జరుగుతుంది. ఈ కారణంగానే తొడలు, పిక్కలు, మడమలు, పొట్ట, చేతి వేళ్లలో వాపు ఏర్పడుతుంది. చాలామంది పొట్ట ఉబ్బినప్పుడు గ్యాస్ సమస్య అనుకుంటారు. సుదీర్ఘకాలం పాటు పొట్ట ఉబ్బుగా ఉంటే లివర్ సిరోసిస్ కోణంలోనూ దీన్ని పరిశీలించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లివర్ సిర్రోసిస్ కు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే అది క్యాన్సర్ గానూ, లివర్ ఫెయిల్యూర్ గానూ పరిణమించి ప్రాణాలు పోయేందుకు దారితీస్తుంది. అందుకే, ఈ ఐదు శరీర అవయవాల్లో వాపు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించి, తగిన పరీక్షలు చేయించుకోవాలి.

# రోహిత్ అనుభవం, కోహ్లీ దూకుడు.. 2027 ప్రపంచకప్‌లో
# భారత జట్టుకు అవే బలం: జాంటీ రోడ్స్

- 2027 ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరమన్న రోడ్స్
- ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో ప్రతిభ కన్నా మానసిక బలమే కీలకమని వ్యాఖ్య
- కోహ్లీ దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చిన దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం
- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్ అని ప్రశంస
- కెప్టెన్‌గా ఉన్నా లేకున్నా, భారత్ గెలవాలనే కోహ్లీ తపన అమోఘమన్న రోడ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు.జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన,
దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్..
# కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది.మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు.అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసించాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నింగ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది.లక్ష్య ఛేదనలో సౌత్ జోన్‌కు ఓపెనర్ రికీ భుయ్ (42) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, లంచ్ విరామానికి ముందు, ఆ తర్వాత నార్త్ జోన్ స్పిన్నర్ అబిద్ ముస్తాక్ విజృంభించడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. రికీ భుయ్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయగా, షేక్ రషీద్, నారాయణ్ జగదీశన్ (43) వికెట్లను ముస్తాక్ పడగొట్టాడు. దీంతో సౌత్ జోన్ 102 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒకింత కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ అయిన స్మరణ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో
స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైనప్పుడు వేగం పెంచుతూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. గతేడాది ఫైనల్లో ఓటమిపాలైన సౌత్ జోన్, ఈసారి బలమైన ఆత్మవిశ్వాసంతో టైటిల్ పోరుకు సిద్ధమవుతోంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఓడించి ఈస్ట్ జోన్ ఫైనల్‌కు చేరుకుంది. విశేషమేమిటంటే.. 1970/71 సీజన్ తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడటం ఇదే తొలిసారి.

# చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి లక్ష్య సేన్ ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తీవ్రంగా నిరాశ పర్చాడు. టోర్నీ తొలి రౌండ్‌లోనే కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో తేడాతో ఓటమి పాలై ఇంటిబాట పట్టాడు. బుధవారం (సెప్టెంబర్ 2) షెన్?జెన్ వేదికగా జరిగిన ఈ పోరులో ప్రపంచ ర్యాంకింగ్‌లో తొమ్మిదో స్థానంలో విక్టర్ కేవలం 38 నిమిషాల్లోనే 14-21, 7-21 తేడాతో భారత షట్లర్?ను మట్టికరిపించాడు. భారత షట్లర్ లక్ష్య సేన్ 4-0 ఆధిక్యంతో గేమ్?ను ఘనంగా ఆరంభించాడు. కానీ చివరి వరకు ఆ ఊపును నిలబెట్టుకోలేకపోయాడు. విక్టర్ లాయ్ బలంగా తిరిగి పుంజుకున్నాడు. వ్యూహాత్మక డిఫెన్స్?తో భారత ఆటగాడిని ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో లక్ష్యసేన్ ర్యాలీలను ఛేదించడానికి ఇబ్బంది పడుతూ మరింత ఎక్కువగా రిస్క్ తీసుకోవడం ప్రారంభించాడు. సేన్ పదేపదే బ్యాక్‌హ్యాండ్ సైడ్‌లైన్ వైపు షాట్లు మిస్ చేస్తుండటంతో ఒత్తిడి మరింత తీవ్రమైంది. లాయ్ ఆ పొరపాట్లను తనకు అనుకూలంగా మలుచుకుని తొలి గేమ్‌ను 21-14 తేడాతో గెలుపొందాడు.తొలి రౌండ్ కోల్పోయిన లక్ష్య సేన్?కు రెండో రౌండ్?లో తిరిగి కోలుకునే అవకాశమే లేకుండా పోయింది. బలమైన అటాకింగ్, డిఫెన్స్ గేమ్?తో విక్టర్ లాయ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. 4-11తో వెనకబడ్డ లక్ష్యసేన్ పాయింట్ల అంతరాన్ని పూడ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరిన్ని అనవసర తప్పిదాలు చేసి తగిన మూల్యం చెల్లించుకున్నాడు. కెనడియన్ ఆటగాడు రెండో గేమ్‌ను 21-7 తేడాతో కైవసం చేసుకున్నాడు. దీంతో తొలి రౌండ్ లోనే భారత ఆటగాడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

# 'ఎపిక్' సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాటగా 'సబ్కో' రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు.లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కూర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు.శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. "దేశం కాని దేశంలో" అంటూ ఇంటికి దూరంగా ఉన్న







యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.

'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ '90ం ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. 'సబ్కో' పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. 'సబ్కో'ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965